

ఓం నమో భగవతే శ్రీ రమణాయ

# రమణ భాస్కర



వ్యవస్థాపక సంపాదకులు : బి.వి.ఎల్.ఎన్.రాజు

సంపుటి : 13 | సంచిక : 01 | సెప్టెంబర్ 2007

రమణ భాస్కర
ఆధ్యాత్మిక మాస పత్రిక
పేజీలు : 24
గౌరవ సంపాదకులు
శ్రీమతి P.H.V. సత్యవతి (హైమ)

చందా
సంవత్సర చందా:రు॥150/-
విడి ప్రతి : రు॥ 10/-

చిరునామా
రమణ భాస్కర
శ్రీ రమణ క్షేత్రం,
జిన్నూరు - 534 265
ప॥గో॥ జిల్లా, ఆం॥ప్ర॥

పబ్లిషర్
సద్గురు శ్రీ నాన్నగారు
శ్రీ రమణ క్షేత్రం
జిన్నూరు - 534 265
☎ 08814 - 224747
9247104551

ఈ సంచికలో....

జిన్నూరు............ 29-07-07
జిన్నూరు............ 30-07-07
తాడేపల్లిగూడెం . 19-08-07

ప్రింటర్
శ్రీ భవాని ఆఫ్‌సెట్ ప్రింటర్స్
(దుడే శ్రీను) ఎస్.వి.ఆర్. కాంప్లెక్స్,
పాలకొల్లు, 9848716747

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 29-07-2007, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

వ్యాసపూర్ణిమ అంటే వ్యాసుడు యొక్క జన్మదినోత్సవం, దీనినే గురుపూర్ణిమగా మన పెద్దలు ఏర్పాటు చేసారు. వ్యాసుడు నారాయణుడి యొక్క అంశ అని చెపుతారు. ఆయన వేదాలను విభజించాడు కాబట్టి వేదవ్యాసుడు అని పేరు వచ్చింది. ఆయన బ్రహ్మసూత్రాలు వ్రాసాడు, పంచమవేదం అయిన భారతం వ్రాసాడు ప్రపంచంలో ఎన్ని రకాల మనస్తత్వాలు ఉన్న మనుషులు ఉంటారో అందరి గురించి భారతంలో చర్చించాడు. మహాభారతం వ్రాసి వ్యాసుడు ఏమి చెప్పాడు అంటే ప్రపంచంలో ఎక్కడాలేనిది భారతంలో ఉండవచ్చు కాని భారతంలో లేనిది ప్రపంచంలో ఎక్కడా లేదు అన్నాడు, అంటే అన్నిరకాల మనస్తత్వాల గురించి అందులో వ్రాసాడు. మహాభారతం, రామాయణం ఇవి రెండూ మహాకావ్యాలు. ఈభూమి ఎంతకాలం ఉంటుందో, కొండలు ఎంతకాలం ఉంటాయో, నదులు ఎంతకాలం ప్రవహిస్తూఉంటాయో అంతకాలం ఈ కావ్యాలు ఉంటాయి. మనం దురదృష్టవంతులము ఎందుచేతనంటే మనం పెరిగే వాతావరణం మంచిదికాదు, మనం చేసే స్నేహాలు మంచివి కాదు. అందుచేత మనకు భగవంతుడుయందు గౌరవం ఏర్పడటం లేదు. భగవంతుడు చెప్పిన మాటలే భగవద్గీత. మనం చేసే స్నేహాలు మంచివి కాకపోవటం వలన మనలో అంతర్యామిగా ఉన్న నారాయణుడే కృష్ణరూపంలో వచ్చి భగవద్గీత ప్రవచనం చేసాడు అని మనకు అర్థంకావటంలేదు. కృష్ణుడు అంటే వసుదేవుడిగారి అబ్బాయి అనుకొంటున్నాము. ఆయన యొక్క ఔన్నత్యం తెలియక పోవటం వలన ఆయన మీద మనకు గౌరవం కలగటం లేదు, ఆయన చెప్పిన శాస్త్రం

మీద మనకు గౌరవం లేదు. మన బుద్ధి కలుషితం అయిపోవటం వలన మనం ఇలా తయారయ్యాము. కృష్ణుడిని సవరణ చేద్దాము, ఆచార్యులవారిని సవరణ చేద్దాము, వ్యాసుడిని సవరణ చేద్దాము అనుకొంటే ఇంక మనం ఏమి పనికివస్తాము. ఈగోడ ప్రక్కన ఏముందో మనకు తెలియదు కాని వారు కొన్ని వేలసంవత్సరాలలో రాబోయేది చూసి రచన చేయగలరు. అక్కడదాకా ఎందుకు మీ మొఖాలు చూసి మీ పూర్వజన్మలు ఎటువంటివో, మీ రాబోయేజన్మలు ఎటువంటివో చెప్పగలిగిన గురువులు ఇప్పుడు కూడా ఉన్నారు. భక్తకోటిని తరింపచేయటం తప్పించి ఏ ఆచార్యుడికైనా ఇంకో ధ్యేయం లేదు.

ఈ భక్తి ఎందుకు, జ్ఞానం ఎందుకు, సత్సంగాలు ఎందుకు అంటే అమృతానుభవం పొందటానికే ఇవి అన్నీ కూడా. అమృతానుభవం పొందేవరకు వారు ధనవంతులైనా, పండితులైనా, పామరులైనా ప్రతీ జీవుడిని అశాంతి వెంటాడుతుంది, దుఃఖం వెంటాడుతుంది. ధనంలేని వారందరూ మనకు ధనం వస్తే శాంతిగా ఉండవచ్చు అనుకొంటారు, చదువులేని వారందరూ మనం పాండిత్యం సంపాదిస్తే శాంతిగా ఉండవచ్చు అనుకొంటారు. వారికి శాంతి రాదు వస్తే అశాంతి రావచ్చు. మేము చాలా కష్టాలు పడుతున్నాము అందుచేత అశాంతిగా ఉన్నాము అనుకొంటారు, మనం అనుకొనేవి అన్నీ అసత్యం. అవతారపురుషుడు అయిన శ్రీరాముడికంటే ఎక్కువ కష్టాలుపడినవారు ఇందులో ఎవరైనా ఉన్నారేమో చెప్పండి. ఆయనకు రాజ్యంపోయింది, అడివికి పొమ్మన్నారు, భార్యను రాక్షసులు తీసుకొని పోయారు, అనేక రకాల బాధలు, అయోధ్యలో మంచంమీద పడుకొంటే అడవిలో నేలమీద పడుకోవటం. ఇన్ని కష్టాల మధ్యన శాంతిగా, వికారం లేకుండా ఎలా ఉండగలిగాడు. లోకంలో ఉంటూ లోకవాసన లేకుండా, ఒక దేహంలో ఉంటూ దేహవాసన లేకుండా ఉన్నాడు, ఆయన పరమాత్మ. అసలు దుఃఖకారణం బయటలేదు, నీలోపలే ఉంది. అన్ని విధాల కష్టాలు పడుతూ చివరకు తిండికి కూడా ఇబ్బందిపడుతూ శాంతిగా ఉండే వారిని నేను చూసాను. మరి అలా శాంతిగా ఎలా ఉండగలుగుతున్నారు. బయటపరిస్థితులు అన్నీ అబద్ధం. మనం అసలు సమస్యను పరిష్కారం చేసుకోలేక ఆ కారణం వలన దుఃఖం వస్తోంది, ఈ కారణం వలన అశాంతి వస్తోంది అని అనుకోవటం తప్ప ఆ కారణాలు నిజం కాదు. మన అశాంతికి, దుఃఖానికి బయటకారణాలు నిజం కాదు, దేహాభిమానం వలననే మనకు అశాంతి వస్తోంది, దేహాభిమానం వలననే మనకు దుఃఖం వస్తోంది. భారతదేశం అంతా మీకు రాసిచ్చేసినా మీకు దేహబుద్ధి కనుక ఉంటే మిమ్మల్ని దుఃఖం విడిచిపెట్టదు. మీకు వెయ్యి కోట్లు ధనం ఉంది అనుకోండి. దేహంతో తాదాత్మ్యం పొందే నేనులోనుండి మీరు బయటకు రాలేదు అనుకోండి ఈ జన్మలోనేకాదు మీరు కోటి

జన్మలు ఎత్తినా మిమ్మల్ని దుఃఖం విడిచిపెట్టదు.

కొంతమందికి పాండిత్యం ఉంటుంది, శబ్ధం యొక్క అర్థం తెలుస్తూ ఉంటుంది కాని ఆ శబ్ధం ఎందుకు పుట్టబడింది అని అంత లోతులలోనికి వెళ్ళలేరు, దాని హృదయాన్ని పట్టుకోలేరు. ఎందుచేతనంటే వారికి ఉన్న గర్వం అంత లోతులలోనికి వెళ్ళనివ్వదు. మనం బాగుపడటానికి ఒక్క వాక్యం చాలు అది మన గుండెకు పడితే. భగవంతుడు చెప్పిన ప్రకారం జీవిస్తూ, సదాచారాన్ని పెంచుకొని మనలను మనం సంస్కరించుకోవాలి అని మనం అనుకోవటం లేదు. భగవంతుడు ఏమైనా తప్పలు చెప్పాడేమో సవరణ చేద్దాము అని చూస్తున్నాము, దీనికి మన బుద్ధిలో ఉన్న దోషాలు కారణం. మనకు ఒకోసారి దుఃఖం వచ్చినప్పడు దేవుడు లేడేమో అనుకొంటాము. ఆ దుఃఖం ఏ కారణం వలన వస్తోంది అని పరిశీలన చేస్తే, విచారణ చేస్తే రేపు కాదు ఈ రోజునే ఆ దుఃఖం నశిస్తుంది, మీరు పరిశీలన చేయటం వలన దుఃఖకారణం కాలిపోతుంది, అక్కడ ఏమీలేదని మీకు తెలుస్తుంది. భారతంలో మనం ఊహించని ఘట్టాలు చూపించాడు వ్యాసుడు. ఈ కథ వింటూ ఉంటే నాకు ఆశ్చర్యం కలిగింది, నమ్మలేకపోయాను. బృహస్పతి దేవతలకు గురువు. వాదనలో విద్యలకు తల్లి అయిన సరస్వతిని ఓడించాడు, అంతటి విద్యావంతుడు, అంత పెద్దవాడికి తమ్ముడిమీద అసూయ కలిగింది. అంటే మాయను జయించటం ఎంత కష్టమో మీకు నేను చెపుతున్నాను. ఇది భారతంలో వస్తుంది. తమ్ముడు బ్రహ్మచారి, ఆయనను పెద్దపెద్దవారు పిలిచి వారికి ఏ కోరిక నెరవేరటంలేదో, ఆ కోరిక నెరవేరాలంటే ఏ యజ్ఞం చేయాలో అది చేయమని అడిగితే, ఆ యజ్ఞం వేదంలో చెప్పబడినట్లుగా ఆయన చేసేవాడు, వారి కోరికలు నెరవేరేవి. ప్రజల కోరికలు నెరవేరేటప్పటికీ ఆయనకు గౌరవం వస్తుంది కదా. బృహస్పతి తమ్ముడు యజ్ఞాలు బాగా చేయిస్తున్నాడు, వాడు చేసిన యజ్ఞాలకు కోరికలు నెరవేరుతున్నాయి అని చెపితే ఆ కీర్తి విని బృహస్పతి అంతటివాడికి అసూయ వచ్చేసింది. లోపల అసూయ పెట్టుకొని ఇంద్రుడిని పిలిచి తమ్ముడిని అగౌరవపరచి రమ్మన్నాడు. గురువుగారు చెపుతున్నారు అని ఇంద్రుడు వెళ్ళాడు. వాడిని అగౌరవపరచలేక తిరిగి వచ్చేసాడు. దొంగనేను ఉన్నంతసేపు వాడు ఎంత పండితుడైనా, ధనవంతుడైనా ఈ సమస్యలు తప్పవు అందుకు నేను చెపుతున్నాను. తమ్ముడి దగ్గరకు వెళ్ళి వచ్చిన తరువాత ఇంద్రుడు ఇంకోమాట చెప్పాడు ఆమాటకు బృహస్పతికి ఇంకా అసూయ పెరిగిపోయింది. ఏమండీ నిప్ప అన్నింటిని కాలుస్తుంది కాని మీ తమ్ముడు నిప్పను కూడా కాల్చగలడు అన్నాడు. వాడు ముట్టుకుంటే నిప్పే కాలిపోతుంది కాని వాడు కాలడు అంటే వాడు అంత పవిత్రుడు. వాడిమీద మీకు అసూయ ఏమిటి? గురువుగారు మీరు మహామేధావి మీ తెలివితేటలను అసూయ మీద ఫోకస్

చేయకండి, మీలో అంతర్యామిగా ఉన్న నారాయణుడి మీద ఫోకస్ చెయ్యండి. మీకు చెప్పదగినవాడను కాదు అని ఇంద్రుడు అంటాడు. అప్పడు బృహస్పతి తన తెలివినంతా భగవంతుడిమీద ఫోకస్ చేస్తే అప్పడు తమ్ముడిమీద ఉన్న అసూయపోయింది. నీవు వేరు, నేను వేరు అనే భేదబుద్ధి ఉన్నంతకాలం అసూయ రాకుండా ఎవరూ ఆపుచేయలేరు. అసూయ, భయం, ఇష్టం, అయిష్టం ఇవి అన్నీ ద్వైతంలో నుండే వస్తాయి. ఇవి అన్నీ ఎందుకు చెపుతున్నాను అంటే అమృతానుభవం కలిగేవరకూ, అద్వైతానుభవం కలిగేవరకూ బృహస్పతి అయినా, మీరు అయినా, నేను అయినా ఒడ్డుకు వచ్చేసాము అని అనుకోవటానికి వీలులేదు. మన బుద్ధిలో దోషాలు అలాగే పెట్టుకొని మేము ఒడ్డుకు వచ్చేసాము అంటే అది ఇంకా ప్రమాదం. ప్రతీ శరీరం చనిపోతుంది, అది శరీర ధర్మం. మనం సంపాదించిన డబ్బు, మన వస్తువులు, బట్టలు ఇవి ఏమీ మరణానంతరం మన కూడా రావు. జీవించి ఉండగా మనం సంపాదించుకొన్న మంచి చెడ్డలు, మన బుద్ధిలో ఉన్న దోషాలు ఇవి అన్నీ మరణానంతరం మన కూడా వస్తాయి. శరీరం మరణించిన తరువాత మన కూడా వచ్చే వాటిని మనం పట్టించుకోవటంలేదు, మన కూడా రానివాటికి మనం ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తున్నాము. ఇదే మాయ. వల్లకాటితో ఆగిపోయే వాటికి ఇచ్చే విలువ మరణానంతర జీవితంలో మన కూడా వచ్చేవాటికి మనం ఇవ్వటంలేదు. మనకు జన్మ ఎందుకు వచ్చింది అంటే మరల జన్మ రాకుండా చూసుకోవటానికి ఈ జన్మను ఉపయోగించుకోవాలి, అదీ సిద్ధాంతం. ఈ జన్మను ఎలా ఉపయోగించుకోవాలి అంటే రాబోయే జన్మ రాకుండా ఉండటానికి ఈ జన్మను సద్వినియోగం చేసుకోవాలి.

బయట శుచిగా ఉండాలి, లోపల శుచిగా ఉండాలి అని గీతలో పరమాత్మ చెప్పాడు. బయట శుచి మన కూడా రాదు కాని బయట శుచిగా ఉంటే శారీరక అనారోగ్యాలు తొందరగారావు. దేహయాత్ర సరిగా జరగటానికి దేహాన్ని ఆరోగ్యంగా ఉంచుకోవాలి, దానిని శుచిగా ఉంచుకోవాలి. భారతయుద్ధం తరువాత కృష్ణుడు ద్వారకకు వెళ్ళిపోతూ మార్గమధ్యంలో చిన్ననాటి స్నేహితుడి ఇంటికి వెళతాడు. కృష్ణుడి స్నేహితుడు మంచివాడేకాని చాలా అమాయకుడు. ఈ రకమైన మనుషులను కూడా భారతంలో వ్యాసుడు చూపించాడు. సుఖంగా బతకటానికి మంచితనం ఒక్కటే సరిపోదు తెలివితేటలు ఉండాలి, వివేకం ఉండాలి, వీడికి అవి లేవు అని చూపించటానికి కృష్ణుడి స్నేహితుడిని మనకు చూపించాడు వ్యాసుడు. కృష్ణుడు స్నేహితుడు ఆయనను గుర్తుపట్టాడు, ఇద్దరు పలకరించుకొన్నారు. వాడు ఎంత అమాయకుడు అంటే మాటల సందర్భంలో కౌరవులు, పాండవులు, భీష్ముడు అంతా

బాగున్నారా అని అడిగాడు. అంటే అసలు దేశంలో ఏమి జరుగుతోందో వాడికి తెలియదు. అంతయుద్ధం జరిగినావాడికి తెలియలేదు. అటువంటి అమాయకులు ఇప్పడు కూడా ఉన్నారుసుమా అని వ్యాసుడు చెప్పటం. కృష్ణుడు ఏమి చెప్పాడు అంటే యుద్ధం జరిగింది కౌరవులు, భీష్ముడు అందరూ చనిపోయారు, సైన్యం కూడా చాలామంది చనిపోయారు అని చెప్పాడు. వాడు ఎంత అమాయకుడు అంటే కృష్ణుడితో అందరూ నిన్ను దేవుడు అంటున్నారు, ఇంతమంది చనిపోతూ ఉంటే నీవు ఎలా వూరుకున్నావు అని కృష్ణుడి మీద కోపం వచ్చి శపించటానికి సిద్ధమయ్యాడు. నిజంగా వాడికి శపించేశక్తిలేదు. నీవు తొందరపడి శపించవద్దు, నేను రాయబారం చేసాను, నా గురించి వారికి తెలియటం లేదు అని విశ్వరూపం చూపించాను అయినా వారికి అర్థంకావటంలేదు. మరి ఇంక నేను ఏమి చేయగలను అన్నాడు కృష్ణుడు. అప్పడు ఆ అమాయకుడు కొంత శాంతపడ్డాడు. వీడికి లోకం గొడవలు సరిగా తెలియవు. ఏదో కుల ధర్మంగా ఉంటున్నాము, ఆచారాలు పాటిస్తున్నాము అనే గొడవ తప్ప లోపల అభివృద్ధి ఏమైనా ఉందా అంటే అదీ ఉండదు. కొంతమంది పైకి మంచివారుగా, పవిత్రులుగా కనిపిస్తారు కాని లోపల అంత పవిత్రత ఉండదు. కృష్ణుడు స్నేహితుడి దగ్గర సెలవు తీసుకొంటూ నీకు ఎప్పడూ నేను ఏమీ ఇవ్వలేదు. ఏదైనా కోరిక కోరుకో ఇస్తాను అంటాడు. మోక్షం కోరుకొంటే ప్రసాదిద్దామని పరమాత్మ అడిగాడు. వాడు ఎంత అమాయకుడు అంటే నాకు వర్షాకాలం, శీతాకాలం మంచి నీళ్ళు దొరుకుతున్నాయి. వేసవికాలం ఇబ్బంది పడుతున్నాను. నాకు మంచినీళ్ళు దొరకనప్పడు నేను స్మరించుకొన్న వెంటనే మంచినీళ్ళు దొరికేలాగ చూడు అన్నాడు. జ్ఞానం కోరుకొంటాడు అనుకొంటే మంచినీళ్ళు అడుగుతున్నాడు. ఏదో అమాయకుడు వీడిని తరింపచేయాలని పరమాత్మ అనుకొన్నాడు. ఈ అమాయకుడు ఒకసారి ఎడారిలో ప్రయాణిస్తున్నాడు, వాడికి వాటర్ అవసరం అయ్యింది. వాటర్ ఇస్తానన్నావు కదా ఇప్పడు నాకు వాటర్ కావాలి అని పరమాత్మను స్మరించుకొన్నాడు. వాడికి బాహ్యశుచి ఉంది కాని లోపల శుచి లేదు. వాటర్ పేరు మీద వాడికి అమృతం పోయాలని కృష్ణుడు ఏమి చేసాడు అంటే ఇంద్రుని పిలిచి వాడు వాటర్ కావాలంటున్నాడు వాడికి అమృతం ఇచ్చినా పుచ్చుకోడు, నీవు అమృతం తీసుకొని వెళ్ళి ఇది వాటర్ అని చెప్పి వాడికి ఇవ్వు అని చెప్పాడు. వాడు మామూలు మనిషి వాడికి అమృతం ఎలా పోస్తాము అని ఇంద్రుడు అంటాడు, వాడు తరించాలి అంటే ఒక కండిషన్ చెప్పాడు ఇంద్రుడు. మీరు వెళ్ళమంటే వెళతాను, ఛండాలుని రూపంలో వెళతాను, కుండపట్టుకొని వెళతాను, ఆ కుండలో మీరు చెప్పినట్లే అమృతం తీసుకొని వెళతాను అంటాడు. ఇంద్రుడు ఛండాలుని రూపంలో వెళతాడు. వీడిని చూసి నిన్ను ముట్టుకోకూడదు, ఇంక నీవు తెచ్చిన మంచినీళ్ళు నేను ఎలా తీసుకొంటాను, నీవు దూరంగా వెళ్ళు అని చెపుతాడు. అప్పడు

ఇంద్రుడు వెళ్ళిపోతాడు. వ్యాసుడిది ఎంత విశాలమైన బుద్ధో చూడండి. వీడికి బాహ్య శుచేగాని అంతర్ శుచి ముఖ్యం అన్న సంగతి తెలియటం లేదు, లోపల ఉన్న మనస్సును బాగుచేసుకోవాలి అనే బుద్ధి వీడికి కలగటం లేదు అని తెలియజేయటానికే ఇది అంతా చెపుతున్నాడు. అప్పుడు వాడికి కృష్ణుడు కనిపించి నీవు మంచినీళ్ళు అడిగావు, మంచి నీళ్ళు తెచ్చాడు కదా ఎందుకు నీవు పుచ్చుకోలేదు అని అడిగాడు. వాడు ఛండాలుడు అని చెపుతున్నాడు. నువ్వు బాగుపడలేదు, నన్ను అవమానాలకు గురిచేసావు అంటాడు కృష్ణుడు. ఇంద్రుడు ఏమన్నాడు అంటే నేను ఛండాలుని రూపంలో పట్టుకొని వెళ్ళిన అమృతం వాడు తాగకపోతే నీవు ఓడిపోయినట్లే అని పరమాత్మతో చెపుతాడు. ఇంద్రుడి చేతిలో ఓడిపోయే పరిస్థితి నాకు తీసుకొని వచ్చావు. నేను ఓడిపోయినా పరవాలేదు నువ్వు బాగుపడ్డావా అంటే నీవు బాగుపడలేదు అంటే ఈ రకమైన మనుషులు కూడా ప్రపంచంలో ఉంటారు అని చెప్పటానికి వ్యాసుడు ఇది చెప్పాడు. కొంతమంది వేషం చూసి మోసపోతారు, కొంతమంది ఆడంబరంగా చెప్పేమాటలకు మోసపోతారు. కొంతమంది ఎలా ఉంటారు అంటే మనం అందరికి బాగా కనిపిస్తున్నామా లేదా, బయటవారు అందరూ మనలను గొప్పవారు అనుకొంటున్నారా లేదా, అందరూ మనవంక చూస్తున్నారా లేదా ఇలా అనుకొంటూ ఈ రకంగా బతికి చనిపోతారు. మరణానంతరం మనకూడా ఏదైతే వస్తుందో దానిని బాగుచేసుకోవాలనే ప్రయత్నం చేయరు. లోపల శుచి లేకపోవటం వలన వాడు అమృతాన్ని పోగొట్టుకొన్నాడు. కృష్ణుడి స్నేహితుడి ద్వారా మనం నేర్చుకోవలసింది ఏమిటి అంటే ఆడంబరాలు, ఆచారాలు ముఖ్యం కాదు, ఆలోచన ముఖ్యం, సబ్జక్టు ముఖ్యం.

నీవు చేసే పని శ్రద్ధగా చెయ్యాలి, నీకు ఏకాగ్రత ఉండాలి, నువ్వు చేసే పనియందు నీకు గౌరవం ఉండాలి. నువ్వు డాక్టరు వృత్తి చేస్తూ నేను ఇంజనీరు ఎందుకు అవ్వలేదు అనుకోకూడదు. నువ్వు ఏ కృషి అయితే చేస్తున్నావో ఆ కృషిపట్ల నీకు గౌరవం ఉండాలి, నీవు ఇష్టంగా, ప్రేమగా చెయ్యాలి. నీవు చేసేపని ఎంతబాగా చెయ్యాలి అంటే ఇంతకంటే బాగా చెయ్యటానికి ఇంకో అవకాశం లేదు అన్నంత బాగా చెయ్యాలి. పనిలో భగవంతుడిని చూడటం నేర్చుకోండి. జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి. ఏ సంఘటన జరిగినా ఆ జీవుడు నేర్చుకోవలసిన పాఠాల కోసమే అవి జరుగుతూ ఉంటాయి. మనం భగవంతుడి మాటలు వినము. అందుచేత ఆయన ఏవో సంఘటనలు కల్పించి మొట్టికాయలు మొడతాడు. తినవలసిన మొట్టికాయలు తిన్నాక, భగవంతుడి మాట వింటే ఈ అవస్థలు వచ్చి ఉండేవి కాదు అనే బుద్ధి వచ్చాక ఆయన మాటలు వింటాము. కౌరవులు చనిపోయాక ధృతరాష్ట్రుడు అనుకొనేవాడు విదురుడి మాటలు వింటే నాకు ఈ గతి ఉండేది కాదు, మమకారం

కొలది ధుర్యోధనుడి మాటలు విన్నాను, కుటుంబంలో అందరూ చనిపోయాక ఇప్పుడు గుర్తుకు వస్తోంది, అప్పుడు విని ఉంటే ఈ పరిస్థితి ఉండేదికాదు అన్నాడు. తినవలసిన మొట్టికాయలు తింటేగాని భగవంతుడు చెప్పినమాటల విలువ ఈ జీవుడికి తెలియదు. ముందు లక్ష్మీ కటాక్షం రాకూడదు, ముందు సరస్వతీ కటాక్షం రావాలి అని పెద్దలు చెపుతారు. ముందు సరస్వతీ కటాక్షం వచ్చి తరువాత లక్ష్మీ కటాక్షం వస్తే ఆ డబ్బును సద్వినియోగం చేస్తాడు. ముందు లక్ష్మీకటాక్షం వస్తే వాడి కొంపను వాడే పాడుచేసుకొంటాడు, అలా మనం లోకంలో చూస్తున్నాము కదా. కొంతమంది రోజూ ఏదో విషయం గురించి ఆలోచిస్తూ, ఏదో ఊహించుకొంటూ బెంగపెట్టుకొంటారు. వీటి అన్నింటికి ద్వైతబుద్ధి కారణం. నీవు బుద్ధిమంతుడివి కాకపోయినా ఎదుటివారు నిన్ను బుద్ధిమంతుడు అని అనుకోవాలి అనుకొంటావు. ఇటువంటి ఛండాలపు గొడవలు వదిలెయ్యి. ఒకవేళ ఎదుటివారు అలా నిన్ను అనుకొన్నా నీకు ఏమీ లాభం లేదు, నీవు పాడైపోతావు. మీ బుద్ధిలో ఉన్న వంకరలను తొలగించుకోవటానికి ప్రయత్నం చెయ్యి, ఆత్మవిశ్వాసం పెంచుకో. మన అశాంతికి కారణం లోకవాసన. ఈ మాటలు వినటం వలన లోకవాసన నెమ్మదిగా తగ్గిపోతుంది. నువ్వు నేర్చుకోవటంలో, నువ్వు ఆచరించటంలో, ఇతరులకు అర్థమయ్యేలాగ చెప్పటంలో అశ్రద్ధ పనికిరాదు, అజాగ్రత్త పనికిరాదు అని ఉపనిషత్‌లో చెపుతాడు. సూర్యుడు గొప్పవాడా, గురువు గొప్పవాడా అని ఒక పురాణంలో చర్చ ప్రారంభమయింది. సూర్యుడు అంటే బయటచీకటిని పోగొట్టేవాడు, గురువు అంటే లోపలచీకటిని పోగొట్టేవాడు అందుచేత ఇద్దరూ గొప్పవారే అన్నారు. ఇంకా చర్చ కొనసాగుతోంది, బయటచీకటిని పోగొట్టటంకంటే లోపలచీకటిని పోగొట్టటం చాలాకష్టం. దీపం వెలిగిస్తే బయటచీకటి పోతుంది కాని లోపలచీకటిని తొలగించటం చాలా కష్టం అందుచేత గురువును ఎక్కువగా గౌరవించాలి అన్నారు. గురువు ఏమిచేస్తాడు అంటే మీకు ఉన్న తెలివితేటలను సబ్జక్టు మీద ఫోకస్ చేయిస్తాడు.

మీకు దేహాత్మబుద్ధి ఉన్నంతకాలం, దేహంతో తాదాత్మ్యం పొందే సైతాను ఉన్నంతకాలం బయట పరిస్థితులు అన్నీ అనుకూలంగా ఉన్నా మిమ్మల్ని దుఃఖం వెంటాడుతుంది. ఆ దుఃఖపడే వాడు లోపల ఉన్నప్పుడు మీరు దుఃఖం లేకుండా ఉండలేరు. దేహం మరణించినప్పుడు మనందరకు దుఃఖం వస్తుంది. మీ మరణాన్ని కూడా నేనే అని భగవంతుడు చెప్పాడు ఇంక మనకు దుఃఖం ఎందుకు? పాతబట్టలు తీసేసి కొత్తబట్టలు ఇస్తాడు. ఆ దేహం సాధనకు పనికిరాదు అనుకొన్నప్పడు ఆ దేహాన్ని మార్చి కొత్తదేహాన్ని ఇస్తాడు. మృత్యురూపంలో వచ్చేవాడిని కూడా నేనే అని భగవంతుడు చెప్పినప్పటికీ ఆ మాటలయందు మనకు విశ్వాసం లేక అశాంతికి గురి అవుతున్నాము. మన ప్రయత్నం లేకుండా సహజంగా ఇంద్రియాలు, మనస్సు భగవంతుడివైపు తిరిగి ఉంటే మన మనస్సులో ఉన్న దోషాలు అన్నీ వాటంతట అవే కాలి బూడిద అయిపోతాయి.

నాకు ముక్తివద్దు, భక్తిలో ఉన్న సుఖం చాలు అనిపిస్తుంది, అదీ భక్తి యొక్క వైభవం. భగవంతుడు అంతటా ఉన్నాడు, మనలో అంతర్యామిగా ఉన్నాడు. సాధన ఎందుకు అంటే మనలో అంతర్యామిగా ఉన్న సద్వస్తువును గ్రహించటానికి మన మనస్సును, శరీరాన్ని సిద్ధం చేయటానికే సాధన. అంతర్యామి యొక్క అనుగ్రహం లేకుండా, ఆయనపట్ల మనకు శరణాగతి లేకుండా, ఆయన కటాక్షం లేకుండా కోటి జన్మలు ఎత్తినా మనకు శాంతి కలుగదు. బయటగురువు నిన్ను పుష్ చేస్తాడు, లోపలగురువు నిన్ను పుల్ చేస్తాడు. బయటగురువు నిన్ను ప్రిపేర్ చేసి లోపలకు గెంటుతాడు, లోపలగురువు నిన్ను లోపలకు లాక్కొంటాడు. బయట గురురూపంలో ఉన్నవాడు, లోపల గురురూపంలో ఉన్న వాడు ఈశ్వరుడే. బయట నుండి నీ మనస్సును లోపలకు గెంటేవాడు, హృదయాభిముఖంగా నీ మనస్సును త్రిప్పేవాడు గురువే, సమస్తం గురువే. గురువు యొక్క దయ లేకుండా ఈ వాసనలు అనే దుంగలను బయటకు గెంటలేము. అంతా భగవంతుడే, మంచి భగవంతుడే, చెడ్డా భగవంతుడే. మీకు ఏదైనా చెడ్డ జరిగితే భగవంతుడిని తిడతారు. ఆ చెడ్డకూడా ఆయనే. ఆ చెడ్డను మీకు ఎందుకు పంపిస్తాడు అంటే అందులో నుండి మీరు పాఠాలు నేర్చుకోవాలి అందుకే ఆ చెడ్డను పంపిస్తున్నాడు కాని మీ మీద ఇష్టంలేక కాదు. జ్ఞాని దృష్టిలో ఈ ప్రపంచం అంతా భగవంతుడి యొక్క లీల, ఇది ఒక డ్రామా. ఇందులో ఒకడు చాకలి వేషం వేస్తాడు, ఒకడు మంగలి వేషం వేస్తాడు, ఒకడు రాజు వేషం వేస్తాడు. జ్ఞాని ఆ చాకలి వేషం వేసిన వాడిని చాకలివాడు అనుకోడు, రాజు వేషం వేసిన వాడిని రాజు అనుకోడు, ఈ లోకాన్ని అంతా ఒక డ్రామా కింద చూస్తాడు. జ్ఞానికి లోపలకు చూస్తే ఆత్మానందం, బయటకు చూస్తే లీలానందం. భగవంతుడి యొక్క లీలను చూసినవాడికి ఆనందమే.

భగవంతుడు ఏమనిచెప్పాడు అంటే మీ తెలివితేటల వలన ఈ ప్రకృతిలో నుండి, మాయలో నుండి బయటకు రాలేరు. మీరు ఒక మాట మాట్లాడితే, ఒక పని చేస్తే అది గుర్తింపుల కోసం కాకుండా, మీలో అంతర్యామిగా ఉన్న నా ప్రీత్యర్థం చేస్తూ ఉంటే నా మాయ మీకు దారి ఇస్తుంది అప్పుడు నాలో ఐక్యమవుతారు అని చెప్పాడు. నువ్వు చింతాకంత చింత కూడా లేకుండా నీపని ఏదో నువ్వు చేసుకో. భగవంతుడు నీకు కేటాయించిన పనిని ఈశ్వరార్పణబుద్ధితో చెయ్యి. మీ ఇంట్లో ఉన్న మీ పిల్లలు కూడా మీ సొంతం కాదు, వారు భగవంతుడి వారే. అందుచేత వారిపట్ల నీ డ్యూటీ చెయ్యి, బంధం పెట్టుకోవద్దు. డ్యూటీ చెయ్యటంవలన నీకు పాపం రాదు, బంధం పెట్టుకోవటం వలన పాపం వస్తుంది. ఈ గోడ తప్పు చేస్తుందా, ఏమీ చెయ్యదు. మనిషి పొరపాటు చెయ్యవచ్చు అందులో విశేషం లేదు. ఆ పొరపాటును సవరించుకోవటంలో విశేషం ఉంది, ఆ పొరపాటులో నుండి విడుదల పొందటంలో నీ సాధనబలం, బుద్ధిసూక్ష్మత ఉంది. మేము చాలా మంచివారము, జీవితంలో

ఏ పొరపాట్లు చేయలేదు అని కొంతమంది అనుకొంటారు. మీరు అనుకొనేది నిజమైతే మీకు ఆత్మజ్ఞానం ఎందుకు కలుగలేదు, పరమాత్మతో మీకు తాదాత్మ్యం ఎందుకు రాలేదు? అంటే మిమ్మల్ని మీరు మోసం చేసుకోవటం. నువ్వు మంచి వాడివి, నువ్వు బుద్ధిమంతుడవు అని ఎవరు సర్టిఫికెట్ ఇవ్వాలి, మోక్షదాత అయిన భగవంతుడు ఇవ్వాలి. నువ్వు బుద్ధిమంతుడవని నీ అహంకారం అనుకొంటే కుదరదు. నేను బుద్ధిమంతుడను అని ఎవరైనా అనుకొంటూ ఉంటే వాడు శుభ్రంగా పాడైపోయాడని అర్థం. నిజమైన మంచివాడికి వాడిలో మంచితనం ఉన్నట్లు కూడా వాడికి తెలియదు. మన ఆరోగ్యానికి మంచినీరు, మంచిగాలి ఎలా కోరుకొంటామో అలాగ మన ఆధ్యాత్మిక పురోభివృద్ధికి సజ్జనసాంగత్యం కూడా అటువంటిదే అని ఆచార్యులవారు చెప్పారు. సజ్జనసాంగత్యం వలన నీ ప్రయత్నంతో సంబంధం లేకుండా నీకు వైరాగ్యం కలుగుతుంది, నీకు లోకం మీద ఉన్న మోహం తగ్గుతుంది అని చెప్పారు. తాడు మనకు పాముగా కనిపిస్తోంది అనుకోండి, మనం లైటు తీసుకొని వెళ్ళి దాని మీద ఫోకస్ చేస్తే అది పాము కాదు, అది తాడే అని మనకు తెలుస్తుంది. అలాగే మీకు ఉన్న శక్తియుక్తులను, వివేకాన్ని, విచక్షణను అంతాలోపల ఉన్న అంతర్యామి మీద ఫోకస్ చేస్తున్నారు అనుకోండి అది ఉన్నది ఉన్నట్లుగా మీకు వ్యక్తమవుతుంది. ఎప్పుడైతే ఉన్నది ఉన్నట్లుగా మనకు వ్యక్తమైందో లేనిది లేనట్లు మనకు తెలుస్తుంది. మీ ఇంట్లో టార్చిలైటు ఉంటే సరిపోదు. తాడు పాముగా కనిపిస్తున్నప్పుడు అక్కడకు వెళ్ళి టార్చిలైటు ఫోకస్ చెయ్యాలి, అప్పుడు అది తాడు అని మనకు తెలుస్తుంది, అప్పుడు భయం పోతుంది. మనకు ఉన్న వివేకాన్ని, విచక్షణను సత్యాన్వేషణకు మేగ్జిమమ్ ఉపయోగించాలి. భగవాన్ ఏమి చెప్పారు అంటే నీకు మనస్సు ఉంది, దేహం ఉంది. ఇప్పుడు నీకు మనస్సుతోటి, దేహంతోటి ఎలా తాదాత్మ్యం ఉందో అలాగ నీ మనస్సుకు, దేహానికి ఆధారంగా ఉన్న అంతర్యామితో తాదాత్మ్యం పొందకుండా నీ దేహానికి మరణం వస్తే నువ్వు అనుభవించే నష్టం అంతా ఇంతా కాదు అని చెప్పారు. అంతర్యామితో తాదాత్మ్యం లేకుండా ఏవో లోకానికి సంబంధించిన విషయాలు సాధించినా అదంతా స్వప్న సమానము అని చెప్పారు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 30-07-2007, జిన్నూరు)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈరోజు గురుపూర్ణిమ. నారాయణుడు, దక్షిణామూర్తి, వ్యాసుడు, శంకరాచార్యులు, తరువాత ఆ గురు పరంపరలో మన గురువు. గురువు యొక్క అనుగ్రహం పొందటానికే ఈ గురుమహోత్సవం ఏర్పాటుచేసారు. గురువు యొక్క అనుగ్రహం లేకుండా మనకు స్వరూపజ్ఞానం

కలుగదు. గురువును మనం పట్టుకోవటం వేరు, గురువు మనలను పట్టుకోవటం వేరు. గురువుని మనం పట్టుకొంటే ఒకోసారి వదిలేసే ప్రమాదం ఉంది, వదిలేస్తాము కూడా. మనం ఎంత బుద్ధిమంతులం అంటే మనలో ఉన్న దోషాలు చూసుకోవటం మానివేసి గురువులో దోషాలు చూస్తూ ఉంటాము. ఆచార్యులవారు అలా అన్నారు, రమణుడు ఇలా అన్నారు, ఆయనకు కులబేధం పోలేదు, ఈయనకు మతబేధం పోలేదు ఇలాగ ఏదో ఒకటి బాహ్యదృష్టితో చూసినప్పడు వారిని వదిలేస్తే బాగుండును అని మనకు అనిపిస్తుంది. దీనికి కారణం మనకు ఉండవలసినంత పవిత్రత లేకపోవటం, ఏకాగ్రత లేకపోవటం, బుద్ధిసూక్ష్మత లేకపోవటం. పాల్‌బ్రింటన్ రమణమహర్షి గురించి గొప్పగా వ్రాసి, మరల ఆయనను విమర్శిస్తూ ఉండేవాడు. తరువాత పశ్చాత్తాపపడ్డాడు. మామూలుగా ఇటువంటి ప్రమాదాలు తప్పవు. గురువు వారిని గౌరవించలేదు అనుకోండి, వారి అహంకారాన్ని సంతృప్తి చేయకపోతే వారు శత్రువులు అవుతారు. అందరూ అలా చేస్తారు అని కాదు కొంతమంది అలా ఉంటారు దీనికి కారణం పుణ్యబలం లేకపోవటం. గురువు తన భక్తుడి యొక్క అహంకారం అనే పశువును తొలగించటానికి ప్రయత్నం చేస్తాడు గాని వాడి అహంకారాన్ని సంతృప్తి పరచేవాడు ఎవడూ గురువుకాదు. కొంతమంది ఆశ్రమంలో నాలుగు రోజులు ఉన్నా వారితో భగవాన్ మాట్లాడేవారు కాదు అంటే వారంటే విరోధం కాదు. వారికి కొంత క్రమశిక్షణ నేర్పటానికి అలా చేసేవారు. గురువుకు ద్వైతం లేదు ఇంక విరోధి ఎవడు ఉంటాడు. మిమ్మల్ని చాలా నిందించాము, మేము పాడులోకాలకు వెళ్ళిపోతాము అని ఎవరైనా వచ్చి పశ్చాత్తాపపడి భగవాన్‌తో అంటే భగవాన్ ఏమి చెప్పేవారు అంటే ఒక వేళ నీవు పాడులోకాలకు వెళ్ళిపోయినా నీకోసం నేను కూడా అక్కడకు వస్తాను అనేవారు, వాడు గురువు అంటే. ఈశ్వరుడు గురువు ద్వారా పనిచేస్తూ ఉంటాడు. గురువు ద్వారా పనిచేసేవాడు ఈశ్వరుడే అని మనకు తెలియక గురునింద చేస్తాము. శాస్త్రంలో ఏమని చెప్పారు అంటే దేవుడిని నిందిస్తే గురువు రక్షిస్తాడు కాని గురువును నిందిస్తే రక్షించేవాడు ఎవడూ లేడు. మనకు బుద్ధి సూక్ష్మత లేదు అనుకోండి మనం ఎంత ప్రయత్నం చేసినా, గ్రంథాలు చదివినా మనకు స్వచ్ఛతరాదు, క్లారిటీ రాదు. సబ్జక్టు తాలుక క్లారిటీ లేనప్పడు ఆలోచన సక్రమంగా ఉండదు. నిత్యం అనిత్యంగా కనిపిస్తుంది, మంచివాడు చెడ్డవాడుగా కనిపిస్తాడు. బుద్ధిలో స్వచ్ఛత లేనప్పడు, స్పష్టత లేనప్పడు ప్రతీ మనిషి పొరపాటు చేస్తాడు. అద్దంమీద దుమ్ము ఉన్నప్పడు మన ప్రతిబింబం సరిగా కనబడదు అలాగే మన హృదయంలో అంతర్యామిగా ఈశ్వరుడు ఉన్నప్పటికీ మన బుద్ధిలో దోషాలు ఉంటే ఆయన మనకు గోచరం కాడు. గురువు మనలను పట్టుకొన్నాడు అంటే అది జన్మాంతర అనుబంధం అని గుర్తు పెట్టుకోండి. ఎల్లమ్మ,

పుల్లమ్మ మాటలు పట్టుకొని పదిరోజులు వాడు గురువు అని, పదిరోజులు వీడు గురువు అని తిరిగితే చివరకు అవి నిలబడే టిక్కెట్లు కాదు. వారు చెప్పేమాటలు ఒకటి, లోపల ఏవో కోరికలు, అధికార వాంఛ ఉంటుంది, వారి అహంకారాన్ని గ్లోరిఫై చేయాలి అనుకొంటారు. గురువు దగ్గరకు వెళ్లినప్పడు ఎప్పడూ పెద్దరికాలు కోరుకోకూడదు, మన గర్వం అక్కడ చూపించకూడదు. కొంతమంది ఏమి చేస్తారు అంటే వారి మనస్సులో ఏవో వికారాలు ఉంటాయి, అవి అక్కడ కక్కుతూ ఉంటారు. గురువు ఆ వికారాలను తొలగించటానికి చూస్తాడు కాని ఆ వికారాలతో తాదాత్మ్యం పొందడు, వాటితో తాదాత్మ్యం పొందితే వాడు గురువు అవ్వడు, వాడు జీవుడే అవుతాడు. ఏ జీవుడిని ఎప్పడు ఎక్కడ ఎలా అనుగ్రహించాలో అన్నీ గురువే చూసుకొంటాడు, దానికోసం ఎదురుచూడనక్కర లేదు, తొందరపాటు పనికిరాదు, తొందరపాటు వలన మనమే నష్టపోతాము.

మనం నిజమైన భక్తులమైతే మనం గురువును అడిగేది ఒక్కటే నాకు భక్తి అనే బిక్ష పెట్టమని, అంతకంటే అడిగేది ఏమీ లేదు. నదికి వరద వచ్చినప్పడు ఆ నదీ ప్రవాహంలో పెద్దపెద్ద వృక్షాలు, దుంగలు గడ్డిపరక కొట్టుకొని వెళ్లిపోయినట్లుగా ఎలా కొట్టుకొనిపోతాయో అలాగ ఈశ్వరుని పట్ల, గురువుపట్ల మనకు నిజమైన భక్తి కుదిరితే ఆ భక్తి ప్రవాహంలో మనలో ఉన్న బలహీనతలనే దుంగలు, వాసనలు అనే బండరాళ్లు బయటకు కొట్టుకొనిపోయి, కాలిబూడిద అయిపోతాయి. మెరకనున్న నీరు పల్లానికి ఎంత సహజంగా వస్తుందో అంత సహజంగా మన ప్రయత్నం లేకుండా మన ఇంద్రియాలు, మనస్సు ఈశ్వరుడివైపుకు ప్రయాణం చేస్తూ ఉంటే మనకు ఆత్మజ్ఞానం కలుగుతుంది. భౌతిక ప్రేమలలో తల్లిప్రేమ గొప్పది కాని గురువుప్రేమ అంతకంటే గొప్పది. ఒకోసారి మీతో కఠినంగా మాట్లాడవచ్చు, ఒకోసారి మాట్లాడక పోవచ్చు, అలాగని మామూలు మనిషిని చూసినట్లుగా గురువును చూడకూడదు. మిమ్మల్ని ఎలా బాగుచేయాలి అని గురువు చూస్తాడు. అంతకంటే ఇంకొక అభిప్రాయం ఉండదు. తను ఏ శాంతిని, సుఖాన్ని పొందుతున్నాడో, తను ఏ స్థితిలో ఉన్నాడో ఆస్థితిని మీరు పొందేవరకు మిమ్మల్ని విడిచిపెట్టడు, ఈలోపుగా మీ దేహం చనిపోయినా మీరు ఎక్కడ ఉన్నారో చూసి అక్కడకు వచ్చి ఆయన మీద మీకు ప్రేమ కలిగేటట్లు ఆయనే చేసుకొని మిమ్మల్ని ఉద్ధరిస్తాడు, తరింపజేస్తాడు, వాడే గురువు. గురువు మీద ప్రేమ కలగటం మీరు అనుకొన్నంత తేలిక కాదు. నాకు సంబంధించినంత వరకు రమణభగవాన్‌తో నాకు జన్మాంతర అనుబంధం లేదు అనుకోండి, రమణభగవాన్ నన్ను స్వీకరించి ఉండకపోతే చాలామంది గురువులను, మతాలను మార్చి ఉండేవారము. నీకు స్పష్టత లేనప్పడు, ఏది రైట్‌పాత్ ఏది రాంగ్‌పాత్ అని నీకు

తెలియనప్పుడు సహజంగా తప్పటడుగులు వేస్తాము. మనలను ఎవరైనా విమర్శించారు అనుకోండి, మర్చిపోతే ఏమీ లేదు. భగవంతుడిని, గురువును మనస్సులో పెట్టుకోకుండా వారు తిట్టారు, వీరు కొట్టారు, వారు అలా అన్నారు, వీరు ఇలా అన్నారు అని అనుకొంటూ ఉంటే చైన్ రియాక్షన్ వచ్చేస్తుంది. మనిషి పాడైపోవటానికి చైన్ రియాక్షన్ కారణం. కక్షలు, విరోధాలు ఇవిఅన్నీ మనం కల్పించుకొన్నవే, మర్చిపోతే ఏమీలేదు. రావణాసురుడు మరణించాక సీతమ్మతో ఆంజనేయస్వామి అంటాడు ఇక్కడ నిన్ను చాలామంది బాధలు పెట్టారు, ఎవరో చెప్పు వారిని శిక్షించి వస్తాను అంటాడు. అప్పుడు సీతమ్మ ఏమి చెప్పింది అంటే ఈ సృష్టిలో కోట్లాదిమంది జనంలో చిన్న తప్పు కూడా చేయని మనిషిని ఒకడిని చూపించు అంది సీతమ్మ. మన పని ఏదో మనం చూసుకొని వెళ్ళిపోదాము. కక్షలు, కార్పణ్యాలు అని వెళితే ఇది చైన్‌రియాక్షన్‌కు కారణం అవుతుంది అని సీతమ్మ చెప్పింది. గురువు అంటే ఒక వ్యక్తికాదు, గురువు దేహరహితుడు, గురువు లోకరహితుడు, ఆయన మనోరహితుడు. వాడికి ఒక లోకం అంటూలేదు, వాడు శరీరంలో ఉన్నా శరీరమాత్రుడు కాదు. గురువు యొక్క అనుగ్రహం పొందటానికే గురుపూర్ణిమ మహోత్సవాలు ఏర్పాటు చేసారు. నన్ను చాలామంది పట్టుకొంటామని వస్తున్నారు, పట్టుకోకపోయిన ఫరవాలేదు, పట్టుకొంటామని చెప్పి పడగొడుతున్నారు అన్నారు భగవాన్. గురువు అనుగ్రహస్వరూపుడు, నిజంగా వాడిని పడగొట్టినా అక్కడ అనుగ్రహిస్తూనే ఉంటాడు. ఎందుచేతనంటే గురువు దగ్గర అనుగ్రహం తప్పించి ఇంకోటి లేదు.

మీరు హిమాలయాలలో తపస్సు చేసారా, ఏమి సాధన చేసారు అని నన్ను అడుగుతూ ఉంటారు. మాకు ఏదైనా జ్ఞానం వచ్చింది అంటే, ఏదో నాలుగు మాటలు చెప్పగలుగుతున్నాము అంటే, హృదయంలో ఉన్న నిజం తాలుక ఎరుక కొంచం అయినా మాకు ఉంది అంటే అది గురువు అనుగ్రహమేకాని మా సాధనా ఫలితం కాదు. మేము కష్టపడి సాధనలు చేసింది ఏమీ లేదు. మమ్మల్ని కరెక్టుపాత్‌లో పెట్టి, హెచ్చుతగ్గులు లేకుండా చూసి, మేము వందమంది విరోధుల మధ్యలో ఉన్నా పతనం అవ్వకుండా చూసేది గురువే. నేను మిమ్మల్ని ఎంత స్పష్టంగా చూస్తున్నానో, మీరు నన్ను ఎంత స్పష్టంగా చూస్తున్నారో గురువు యొక్క రక్షణ కూడా మాకు అంత స్పష్టంగా తెలుస్తూ ఉంటుంది. నేను రమణమహర్షిగారి గురించి ఏదో చదివి ఆయన భక్తుడిని అవ్వటంకాదు, ఏదో పెద్దలు చెపుతూ ఉంటే విని ఆయన భక్తుడిని అవ్వటం కాదు, అది జన్మాంతర అనుబంధం అలా గెంటుకొంటూ వచ్చింది అంతేగాని ఇందులో ఆయనకు మాకు మధ్యవర్తులు అంటూ ఎవరూ లేరు. ఆయన అంతట ఆయన నాకు ఎరుకలోనికి వచ్చే వరకు, ఆయన అంతట ఆయన తెలియబడేవరకూ ఎవరి ద్వారా కూడా కనీసం ఆయన పేరు

కూడా నేను వినలేదు, టీచింగ్ మాట వదిలెయ్యండి. అది జన్మాంతర అనుబంధం. అదే భగవాన్ అనేవారు ఏ సంబంధం వలన మనం ఇక్కడ కలుసుకున్నామో ఆ సంబంధం మనలను మరొకచోట కలపదా అనేవారు, అంటే కలిపే తీరుతుంది. దేశంలో వందకోట్లమంది జనం ఉన్నారు. వంద కోట్లమంది నా దగ్గరకు వచ్చారా? రాలేదు, నావారే నా దగ్గరకు వచ్చారు. మనం ఎవరికి తోచిన పనులు వారు చేసుకొంటున్నాము కాని చెడ్డ ఎక్కడ ఉంది అంటే గుర్తింపులు కోరుకుంటున్నాము. అందుచేత జీవితంలో ఫెయిల్ అవుతున్నాము. ఎవరో పళ్ళు తెచ్చారు అనుకోండి, అక్కడ బల్లమీద పెట్టండి అంటే పెట్టరు, నా చేతికి ఇస్తేనేగాని వారికి సంతృప్తి అవ్వదు. నేను నాన్నగారికి పండు ఇచ్చాను అనే గుర్తింపు కావాలి, వాడు పండు ఇస్తున్నట్లు నేను చూడటం ఏమిటి? అంతర్యామి చూస్తున్నాడు కదా, నేను ఎవడిని గుర్తించటానికి. వాడు పండు ఇస్తున్నట్లు నేను చూడలేదు అనుకోండి, ఈ మాంసపు కళ్ళు చూడటం ఎందుకు? జ్ఞాననేత్రం చూస్తోంది కదా. ఈ భక్తులు కూడా ఎలా ఉన్నారు అంటే వారి మాటలు మనం వినలేము. రమణమహర్షి అరుణాచలం ఎందుకు వచ్చాడు అంటే ఇక్కడ పెద్ద ఆశ్రమం కట్టుకోవచ్చు, అభివృద్ధిలోనికి రావచ్చు అని ప్లాన్ చేసుకొని వచ్చాడు అంటున్నారు. వారిని ఇంక ఆ భగవంతుడే రక్షించాలిగాని మనం ఏమీ చేయలేము. ఆయన అక్కడకు వచ్చిన వెంటనే గోచీ పెట్టుకున్నాడు, ఆశ్రమం పెట్టాక కూడా గోచీతోనే ఉన్నాడు, ఇవన్నీ మధ్యలో వచ్చాయి అంతే. మీరు అరుణాచలం ఎందుకు వచ్చారో ఆ పని చూసుకొని వెళ్ళిపోండి అనేవారు భగవాన్. ఇప్పుడు మీరు జిన్నూరు వచ్చారు. మీరు ఏ పని మీద ఇక్కడకు వచ్చారో ఆ పని చూసుకొని వెళ్ళిపోవాలి అంతేగాని జిన్నూరులో ఎంతమంది జనాభా ఉన్నారు, జిన్నూరుకు ఆయకట్ట ఎంత ఉంది అని ఇటువంటి గొడవలలోనికి వెళితే ఇదంతా వచ్చిన పని మర్చిపోవటం. ఇటువంటి గొడవలు అన్నీ మీకు ఎందుకు. లోపల మాధుర్యం ఎలా ఉంటుందో, మంచితనం ఎలా ఉంటుందో తెలియనివాడికి బుద్ధిసూక్ష్మతలేని వాడికి ఆత్మజ్ఞానం ఏమిటి? లోపల ప్రిపరేషన్ లేనప్పుడు, అర్హత లేనప్పుడు కృష్ణుడు చిన్ననాటి స్నేహితుడికి మోక్షం ఇవ్వాలని ప్రయత్నం చేసినా ఇవ్వలేకపోయాడు. ఇవన్నీ వ్యాసుడు ఎందుకు చెప్పాడు అంటే అక్కడ కృష్ణుడి స్నేహితుడే కాదు, ఇప్పుడు మనలో అటువంటి వారు చాలా మంది ఉన్నారు.

దుఃఖానికి బాహ్యంగా కనబడే కారణాలు అన్నీ నూటికి నూరుశాతం అబద్ధం అని భగవాన్ చెప్పారు. ఫలానా కారణం వలన నాకు దుఃఖం వస్తోంది అని అంటాము దీనికి భగవాన్ ఏమి చెపుతున్నారు అంటే అటువంటి కారణాలే మిగతావారికి కూడా ఉంటే మరి వారికి ఎందుకు దుఃఖం రావటం లేదు. మేము ఆర్థికంగా ఇబ్బంది పడుతున్నాము అంటారు. మీకంటే ఆర్థికంగా ఇబ్బంది పడుతూ శాంతిగా ఉండేవారు ఉన్నారు, మరి వారికి ఎందుకు

దుఃఖం రావటం లేదు. అంటే దుఃఖం అనే దుంప, అశాంతి అనే దుంప నీలో ఎంతకాలం అయితే ఎండదో, నీకు బాహ్యపరిస్థితులు నూటికి నూరు పాళ్ళు బాగున్నా నిన్ను అశాంతి విడిచిపెట్టదు, దుఃఖం విడిచిపెట్టదు. ఆ దుంప బయట లేదు, అది నీ లోపలే ఉంది. అది ఎక్కడ ఉందో తెలుసుకొని దానిని తొలగించు కోవటానికి ప్రయత్నం చేయాలి. మనం గుర్తింపులు కోరతాము అనుకోండి, మనం ఏ నేనును అయితే తొలగించుకోవాలను కొంటున్నామో ఆ నేను పెరిగిపోతూ ఉంటుంది. గుర్తింపులు కోరుకోవటం, ఎదుటి వారు మన గురించి మంచిగా చెప్పకోవాలనుకోవటం ఈ బాపతు జనానికి సాధన చేసినా వారికి పెరిగేది అజ్ఞానమే కాని జ్ఞానం రాదు. నీ లోపల ఏమి జరుగుతోందో చూసుకోకుండా, నీ మానసిక ఆరోగ్యం చూసుకోకుండా, నీ బుద్ధి ఎలా పని చేస్తోందో చూసుకోకుండా ఎదుటివారు నిన్ను బుద్ధిమంతుడు అని అనుకోవటం వలన నీకు ఏమి కలిసి వస్తుంది. నీకు ఇంటి దగ్గర తినటానికి తిండిలేదు, ఊరిలో అందరూ నిన్ను కుబేరుడు అంటే ఏమిటి ప్రయోజనం, ఆ పనికిరాని మాటలు ఎందుకు. మనం గురువును పట్టుకొంటామ అనుకోండి, గంటకు ఒక రకంగా ఉంటాము. కాని ఆయన మనలను పట్టుకొంటే ఇంక ఏమీ అక్కరలేదు. మనలను ఆయన ప్రేమిస్తాడు, మనకోసం పనిచేస్తాడు, మన చేత సాధన చేయిస్తాడు, ఎప్పడు మనలను జ్ఞానంతో అలంకరించాలో ఆయనే ముహూర్తం పెట్టుకొంటాడు, ఆయన కనుక మనలను పట్టుకొంటే అన్నీ ఆయనే చూసుకొంటాడు. మన సాధన కేవలం పూజకు, జపానికి పరిమితం అవ్వకూడదు. భగవంతుడు మీకు ఇచ్చిన అవకాశములన్నింటిని సద్వినియోగం చేసుకోవాలి. మీ ప్రవర్తనను మీరు సరిచేసుకోవాలి. మనిషి ఎలా సుఖపడతాడు అని యక్షుడు ధర్మరాజును అడిగాడు. ధర్మరాజు ఏమని చెప్పాడు అంటే నీ డబ్బునుబట్టి, ఐశ్వర్యాన్ని బట్టి నీకు సుఖం, శాంతి రాదు. దైనందిన జీవితంలో నీ ప్రవర్తనను బట్టి శాంతి, ఆనందం వస్తాయిగాని బాహ్యపరిస్థితుల వలన నీకు సుఖం, శాంతి రాదు అని ధర్మరాజు చెప్పాడు. శరీరం మరణించాక మన చదువులు, ఐశ్వర్యాలు ఏదీ మన కూడా రాదు మన ప్రవర్తన మన కూడా వచ్చేస్తుంది.

ఉన్నది ఒక్కటే వస్తువు. ఉన్నదానికి లేకపోవటం అంటూ లేదు, లేనిదానికి ఉండటం అంటూ లేదు. ఎప్పడూ ఏదైతే లేదో అది ఉందని అనుకొంటున్నావు. దానిని త్యాగం చేస్తే చాలు నువ్వు అమృతత్వానికి వారసుడవు అవుతావు. నువ్వు కల్పించుకొన్న విషయాలను త్యాగం చేస్తే చాలు. లౌకిక విద్యలన్నింటికీ గురువులు కావాలి మరి సత్యవిద్యకు గురువు లేకుండా ఎలా సాధ్యం. గురువు అంటే తను ఏదైతే చెపుతున్నాడో దాని తాలుక అనుభవం ఉండాలి, ఆ వస్తువై చెప్పాలి, అప్పడు ఎంతోకొంత క్లారిటీ ఉంటుంది. మనకు క్లారిటీ రాదు అనుకోండి కోటి జన్మలు ఎత్తినా కన్‌ఫ్యూజన్ తప్పదు. అసలు మీరు ఎక్కడికి వెళ్ళాలో మీకు

తెలియదు, అది గురువుకు తెలుస్తూ ఉంటుంది. ఒకోసారి మీ జీవితంలో అనేక మలుపులు తిప్పవచ్చు, అది కూడా మీ మంచి కోసమే చేస్తాడు. మనకు జీవితంలో అనేక సంఘటనలు జరుగుతూ ఉంటాయి, ఏది జరిగినా అది మన మంచి కోసమే జరుగుతోంది అనుకొన్నప్పుడు ఇంక నీకు అశాంతి రాదు. చాలామంది మంచిపనులు కూడా పుణ్యం వస్తుంది అంటేనే చేస్తారు, లేకపోతే చేయరు. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే బుద్ధిమంతుడు ఈ లోకంలో పాపాన్ని ఎలా వదిలించుకొంటాడో, పుణ్యాన్ని కూడా అలా వదిలించుకొంటాడు. వాడు పుణ్యకార్యాలు చేయడు అని కాదు, నేను పుణ్యం చేసాను అనే బుద్ధిని ఈ భూమి మీద వదిలేసి శుభ్రంగా స్నానంచేసి వెళ్ళిపోతాడు. ఎందుచేతనంటే నేను పుణ్యం చేసాను అనే భావన ఉంటే దాని వలన కొన్ని లక్షల జన్మలు వస్తాయి. మీరు ఈ శరీరంతో ఏ పని చేసినా దానితోటి తాదాత్మ్యం చెందకండి అంటున్నారు భగవాన్. శరీరంతో తాదాత్మ్యం పొందుతున్నారు అనుకోండి, దేహాభిమానం పెరిగిపోతుంది, దేహబుద్ధి పెరిగిపోతుంది, దేహబుద్ధి ఉన్నంతకాలం మీకు ఆత్మబుద్ధి రాదు, మిమ్మల్ని అశాంతి విడిచిపెట్టదు. దేహగతమైన నేను మనలను మాయ చేస్తుంది. నువ్వు ఒడ్డుకు వచ్చేసావు, నీకు జ్ఞానం వచ్చేసింది, ఇంక నీకు సాధన ఎందుకు అంటుంది, ఇలా చెప్పి మనలను పాడు చేస్తుంది. అందుచేత మనం బహుజాగ్రత్తగా ఉండాలి, దాని వాండరింగ్స్ అన్నీ మనం గమనిస్తూ ఉండాలి. గురువు అంటే ఎవడో పరాయివాడు కాదు. మనం భగవంతుడిని ఆరాధించగా ఆరాధించగా, ఆయనను ధ్యానించగా ధ్యానించగా, ఆయనకోసం తపించగా తపించగా ఆయనే మనకోసం ఒక శరీరం ధరించి వస్తాడు. వాడే గురువు. మనం మంచిపనులు చేసినా ఇతరుల అహంకారాన్ని సంతృప్తి పరచటానికి చేయకూడదు, అంతర్యామి యొక్క అనుగ్రహం పొందటానికి మంచి పనులు చేయాలి, అప్పుడు ఆయన అనుగ్రహం మనకు దొరుకుతుంది.

దేహప్రారబ్ధంలో మంచి వస్తూ ఉంటుంది, చెడ్డ వస్తూ ఉంటుంది. ఏదో ఒకటి ఎదురవుతుంది, ఇటువంటి తలంపులు వస్తున్నాయి ఏమిటి అని ఒకోసారి మనకు ఆశ్చర్యం కలుగుతుంది. పూర్వజన్మ సంస్కారాలనుబట్టి అటువంటి వాసనలు రావచ్చు, ఆ వాసనలను బలవంతంగా గెంటేయ టానికి చూడకండి, వాటినుండి పారిపోవటానికి ప్రయత్నం చేయకండి. ఇటువంటి వాసనలు వస్తున్నాయి ఏమిటి అని మీరు కంగారుపడకుండా, వాటిని క్లోజ్‌గా చూస్తూ వాటిని పరిశీలనలో పెట్టండి, అప్పుడు అవి నెమ్మదిగా పల్చబడి రాలిపోతాయి, అంతేగాని మీరు కంగారుపడి పారిపోవటానికి ప్రయత్నం చేస్తే మిమ్మల్ని తరుముకొంటూ వస్తాయి. సర్జరీ చేసేటప్పుడు కూడా మత్తు మందు ఎక్కిందో లేదో అని డాక్టరు చూసుకొంటాడు. ఒకటి, రెండు అని లెక్క పెట్టమంటాడు, రాజుగారు మీకు పొలం ఎంత ఉంది, పిల్లలు ఎంతమంది

అని ఇలా అడుగుతాడు. ఈ గొడవలు అన్నీ డాక్టరుగారికి ఎందుకు? మీకు మత్తు ఎక్కేవరకు ఇలా ఏవో మాట్లాడుతూ ఉంటాడు, మత్తు ఎక్కాక ఆయన చేసే సర్జరీ ఏదో చేస్తాడు. గురువు కూడా అంతే. గురువు మీతోటి పరిచయం పెంచుకొంటాడు, మీ పిల్లలు బాగున్నారా అంటాడు, మీరు భోజనం చేసారా అని అడుగుతాడు. ఇలా మీతో మాట్లాడుతూ, ఏ బలహీనతల వలన మీకు ఉన్న వస్తువు ఉన్నట్లుగా వ్యక్తం కావటంలేదో చూసుకొని ఆ బలహీనతలను తొలగిస్తాడు, వాడు గురువు. ఏవైనా బలహీనతలు మరల రిపీట్ అయ్యే అవకాశం ఉంటే తలుపు సందున పెట్టి నొక్కి మరల ఆ బలహీనత రిపీట్ అవ్వకుండా చూస్తాడు. ముగింపులేని ఆనందం, ముగింపు లేని శాంతిలో మిమ్మల్ని ఓలలాడించేవరకూ విడిచిపెట్టడు, వాడు గురువు. ముగింపులేని ఆనందం, శాంతి మనకు అనుభవంలోనికి వచ్చినప్పడు అనవసరంగా వ్యర్థమైన మాటలతో, వ్యర్థమైన ఆలోచనలతో ఎన్ని జీవితాలు ఇలా పాడుచేసుకొన్నామో కదా అని మీకు అనిపిస్తుంది. దురదృష్టవశాత్తు మనం చెడు స్నేహాలలో పడితే వెయ్యిజన్మలు నరకం చూస్తాము. మద్వాచార్యులవారు చెప్పిన ఒక వాక్యం నా గుండెకు పట్టేసింది. ఆయన ఏమనిచెప్పారు అంటే నీకు దుష్టసాంగత్యం తప్పదు అనుకో దుష్టసాంగత్యం చేసి వందజన్మలు పాడుచేసుకొనే బదులు పులి నోట్లో నీ తలకాయపెట్టు అని చెప్పారు. వందజన్మలు నరకం అనుభవించే బదులు పోతే ఈజన్మ ఒకటి పోతుంది అన్నారు. హోలీకంపెనీ యొక్క విలువ అసలు మనకు తెలియటం లేదు. ఏదైనా ఒక వస్తువు యొక్క విలువ మనకు తెలుస్తూఉంటే దానిని సంపాదించుకోవాలని అనిపిస్తుంది, అసలు దానివిలువే మనకు తెలియటంలేదు ఇంకదానిని సంపాదించుకోవాలనే తలంపు ఏమి కలుగుతుంది. నిన్ను ఎక్కడికి తీసుకొనివెళ్ళాలో, నీ జీవితాన్ని ఎక్కడ ఎలా మలుపు తిప్పాలో ఆయనే చూసుకొంటాడు. ముందు మర్యాదగా చెపుతాడు, మీకు అర్థమవ్వకపోతే, మీరు వినకపోతే మొట్టికాయలు మొడతాడు, అవసరమైతే కాళ్ళతోటి తన్నుతాడు, ఆయన ఏది చేసినా అది అంతా కూడా ఆయన అనగ్రహమే అని గ్రహించినవారు ధన్యులు.

మన మనస్సు స్వాధీనంలో ఉండటం లేదు ఏమిటి, ఇలా అయిపోతున్నాము ఏమిటి అని కంగారు పడకండి. గురువు మీద ప్రేమ, భక్తి, విశ్వాసం అలా నిలబెట్టుకోండి, చేయవలసింది అంతా ఆయనే చేసేస్తాడు. మేము సాధన చేసేస్తున్నాము అని గర్వపడకండి. రూపాయికి వంద పైసలు అయితే మీరు చేసే సాధన ఒక పైసా విలువ చేస్తుంది. మిగతా 99 పైసలు గురువే. మీ సాధనలో గురువు యొక్క పాత్ర అత్యంత ప్రధానమైనది. మీరు కంగారుపడుతున్నారు అని ఆయన కంగారుపడడు. మిమ్మల్ని నెమ్మదిగా ప్రిపేర్ చేస్తాడు. మీరు డిజర్వు అయినప్పడు మీకు జ్ఞానం ఇవ్వటానికి ఒక్క క్షణం కూడా వెయిట్ చెయ్యడు. మనగురించి గురువుకు

ఏమీ తెలియదు అనుకోవద్దు. ఆయన మనలో అంతర్యామిగా ఉన్నాడు. ఆయన దగ్గర కూర్చొంటే మన జీవితాలు అన్నీ తెరవబడిన పుస్తకాలు వంటివి. మన గురించి మనకంటే గురువుకు ఎక్కువ తెలుసు, అది మర్చిపోకూడదు. మనలో ఫలానా వాసన ఉంది అని నోటితో చెప్పడు. ఆ వాసన ఉందని మనకు తెలియజేసి, దానిని ఇష్టంగా అనుభవించేలాగ చేసి దానిని బయటకు లాగి కాల్చి బూడిద చేస్తాడు, వాడు గురువు. గురువు సర్వజ్ఞుడు, సర్వాంతర్యామి, సర్వశక్తిమంతుడు. నీవు బ్రహ్మంలో ఐక్యం అయ్యేవరకు గురువు నిన్ను విడిచిపెట్టడు. బంధువులు స్నేహితులు నిన్ను విడిచిపెట్టేస్తారు గాని గురువు నిన్ను విడిచిపెట్టడు. నీకు బ్రహ్మానుభవం కలుగకుండా ఏ బలహీనతలు అయితే ఆటంకాలుగా ఉన్నాయో చూసుకొని ఆ బలహీనతలను అన్నీ ఒక్కసారి తియ్యడు, నువ్వు తట్టుకోవాలి కదా. ఒకదాని తరువాత ఒకటి బయటకు లాగి ఆ బలహీనతలన్నింటినీ కాల్చి బూడిద చేసి నువ్వు ఏదిగా ఉన్నావో అందులో నిన్ను ఐక్యం చేసేవరకూ నిన్ను వెంటాడుతూ ఉంటాడు, వేటాడుతూ ఉంటాడు. వేటగాడు జంతువును ఎలా వేటాడుతూ ఉంటాడో నీకు ఆత్మజ్ఞానం కలిగేవరకూ అలాగ గురువు నిన్ను వెంటాడుతూ ఉంటాడు. వేటాడటం అంటే నీ అజ్ఞానాన్ని వేటాడతాడు, అది బయటకు పోకుండా నువ్వు బ్రాహ్మీస్థితిని పొందలేవు.

## (సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు, 19-08-2007, తాడేపల్లిగూడెం)

ప్రియమైన ఆత్మబంధువుల్లారా,

ఈ ప్రపంచం అనేది ఒక నాటకశాల. ఈ నాటకశాలలో అనేకమంది అనేక పాత్రలు ధరిస్తారు. కొంతమంది రాజుపాత్ర, కొంతమంది మంత్రి పాత్ర, కొంతమంది నౌకరు పాత్ర ఇలా అనేకమంది అనేక పాత్రలు ధరిస్తారు. ఈ పాత్రలు అన్నీ అబద్దాలే. ఆ స్టేజిమీద ఉన్నంతసేపు ఆ పాత్రలు నిజం, స్టేజిమీద నుండి దిగిన తరువాత అది నిజం కాదు. మనకు అర్థమైనా, అర్థంకాకపోయినా అది అంతే. అయితే సహృదయం ఉన్న వారికి, పుణ్యబలం ఉన్న వారికి, సద్బుద్ధి ఉన్నవారికి ఈ సబ్జక్టు అర్థమవుతుంది. ఈ నాటకంలో ఎవరిపాత్ర వారు పోషిస్తారు. ఆ పాత్ర పోషించటం అయిపోయిన వెంటనే ఈ నాటకంలోనికి ఎవడైతే ఈ జీవుడిని పంపాడో ఆ ఈశ్వరుడే మరల వెనక్కి తీసేసుకొంటాడు. అయితే ఈ ఆట అంతా అబద్ధమే, ఇది అంతా భగవంతుడి యొక్క లీల. జయం, అపజయం అనేది మన చేతిలో లేదు. అది పూర్వజన్మ సుకృతాన్ని బట్టి, దైవనిర్ణయాన్ని బట్టి ఉంటుంది కాని కేవలం మన తెలివితేటల మీద ఆధారపడిలేదు. చదువు, సంపాదన ఇవి అన్నీ కూడా అంతే. జయం వచ్చినప్పుడు పొంగిపోవద్దు, అపజయం వచ్చినప్పుడు కుంగిపోవద్దు అని పరమాత్మ గీతలో చెప్పాడు. ఇవి రెండూ నిజం

కాదు. మనం ఒకోసారి చిరాగ్గా, ఒకోసారి కోపంగా, ఒకోసారి గర్వంగా ఇలారకరకాలుగా ఉంటాము. ఒకేరకంగా ఉన్న మూర్తి ఎవరు అంటే దక్షిణామూర్తి, ఆ మొఖంలో ఏ వికారాలు లేని మూర్తి దక్షిణామూర్తి. లోపల గుణాలు ఉన్నప్పడు మొఖంలో వికారాలు వస్తాయి. లోపల గుణాలు లేనప్పడు ఎప్పడూ ఒకే రకంగా ఉంటాము కాని వికారాలు ఉండవు. ఈ ప్రపంచం అంతా గుణాలతో నిండి ఉంది. ఒక కాలప్రవాహంలో శరీరం వచ్చింది, మరో కాలప్రవాహంలో శరీరం పోతుంది. సంపదలు అంతే. ఒక కాలంలో వస్తూ ఉంటాయి, ఇంకో కాలంలో వెళ్ళిపోతూ ఉంటాయి. ఇవన్నీ ఈశ్వరుని నిర్ణయాన్ని బట్టి జరుగుతూ ఉంటాయి. మనం చేయవలసింది ఏమిటి అంటే వాటితో తాదాత్మ్యం పొందకుండా పరమేశ్వరుని పాదాలయందు భక్తి కలిగి ఉంటే ఆయన మాయలో నుండి మనం బయటకు వచ్చేస్తాము. ఈగలు ఎంతసేపు పుండును కోరుకుంటాయి, మంచి మనస్సు లేనివారు పేచీలు కోరుకొంటారు, మంచి మనస్సు ఉన్నవారు శాంతిని, ప్రేమను కోరుకొంటారు, ఏగూటి పక్షులు ఆ గూటికి నెమ్మదిగా చేరుకొంటాయి అని శాస్త్రంలో చెపుతారు. మనం చేసే పని కూడా ఈ శరీరం ద్వారా జరగవలసిన పనే జరుగుతుంది, ఈశ్వరుడు ఏ పని అయితే నిర్ణయించలేదో ఆ పని మనం ఎంత ప్రయత్నం చేసినా ఆపని జరుగదు. ధర్మం అంటే చాలామంది దానం అనుకొంటారు. ధర్మంలో వివేకం, వైరాగ్యం, మంచితనం, డ్యూటీ, ద్వేషం లేకుండా తోటి మానవులను ప్రేమించటం ఇవి అన్నీ వస్తాయి. ధర్మాన్ని స్థాపించటానికే ఈ సృష్టిలోనికి వస్తున్నాను, నాకు వ్యక్తిగతంగా ఇక్కడ పని ఏమీ లేదు అని భగవంతుడు చెప్పాడు. మీ విద్యుక్త ధర్మాలు మీరు చేస్తూ ఉండండి. పరమేశ్వరుడు మన దేహానికి ఏ పని అయితే కేటాయించాడో ఆ పనిని ఓర్పుగా, నేర్పుగా, చిత్తశుద్ధితో, విసుగులేకుండా, ప్రేమగా చేస్తూ ఉంటే అది మనకు జ్ఞానానికి కారణమవుతుంది. వ్యక్తి భావన లేకుండా, రూపబుద్ధి నామబుద్ధి లేకుండా, గౌరవాలు ఆశించకుండా మనం పూజ ఎలా చేస్తామో అలాగ భగవంతుడు మనకు కేటాయించిన పనిని శ్రద్ధగా చేస్తే దాని వలన మీకు జ్ఞానం కలుగుతుంది. ధ్యానం, జపం, తపస్సు చేయటం వలన ఏ ఫలితం వస్తుందో మంచి కర్మలను, మంచి మనస్సుతో చేయటం వలన అదే ఫలితం వస్తుంది.

అసలు లోపల, బయట అంటూ ఏమీ లేదు. లోపల ఒక దేవుడు, బయట ఒక దేవుడు లేడు. లోపల ఉన్నవాడే బయట ఉన్నాడు. బయట ఉన్నవాడే లోపల ఉన్నాడు. మనకు దేహము నేను అనే బుద్ధి ఉంది, దేహబుద్ధి కారణంగా మనకు లోపల, బయట అనే వేరుబుద్ధి వస్తోంది. మనం శాంతిగా ఉంటే లోకం అంతా శాంతిగా ఉంటుంది, మన మనస్సు నిర్మలమైతే, నిశ్చలమైతే, ఏకాగ్రమైతే మనలను తీసుకొనివెళ్ళి పెంట మీద కూర్చోబెట్టినా శాంతిగానే ఉంటాము. మన మనస్సు బాగాలేదు అనుకోండి, మనలను పది అంతస్థుల మేడమీద కూర్చోబెట్టినా

అశాంతేగాని మనకు శాంతి ఉండదు. డబ్బు వలన శాంతిరాదు, ప్రేమ వలన, భక్తి వలన, జ్ఞానం వలన మనకు శాంతి వస్తుంది. మనకు బాహ్యంగా ఎన్ని భోగాలు ఉన్నా మనకు శాంతి లేకపోతే సుఖం లేదు. పూర్వపుణ్యం వలన కొంతమంది చిన్నతనం నుండి భగవంతుడిని స్మరించుకొంటూ ఉంటారు. చిన్నతనంలోనే భక్తి, వైరాగ్యం, వివేకం కలగటం వలన వేరుబుద్ధి తగ్గుతూ ఉంటుంది, రాగద్వేషాలు తగ్గుతూ ఉంటాయి. మీరు వేరు, నేను వేరు అనుకోవటం వలన మిమ్మల్ని చూసి ద్వేషపడుతున్నాను. ఆ వేరుభావనలోనుండే భయం, కోపం, అసూయ, ద్వేషం, కోరిక అన్నీ వస్తున్నాయి. మనం అంతా ఒక్కటే ముద్ద అనుకొన్నప్పుడు ద్వేషం లేదు, కోరిక లేదు, కోపం లేదు. ఉన్నది ఒక్కటే రెండోది అంటూ ఏమీ లేదు, నీకు రెండోది కనిపిస్తూ ఉంటే అది మాయ. మాయ అంటే ఏమీ లేదు లేనిది ఉన్నదాని వలె కనిపిస్తూ ఉంటుంది, లోకం కూడా అంతే. భగవంతుడు ఒక్కడే, అనేక రూపాలలో అనేక పనులు చేస్తూ ఉంటాడు. అందుచేతనే గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే ఎవరు ఏ రూపాన్ని ఆరాధించినా, ఏ నామాన్ని స్మరించినా నన్నే పొందుతారు, అంటే బ్రహ్మమునే పొందుతారు అని చెప్పాడు. మనకు ఒక రూపం, పేరు ఉంది కాబట్టి అవతారాలలో ఏదొక రూపాన్ని ధ్యానిస్తూ, నామాన్ని స్మరిస్తూ మన రూపబుద్ధిలో నుండి, నామబుద్ధిలో నుండి బయటకు రావటానికి జపధ్యానములు ఏర్పాటు చేసారు. మన మనస్సును మనం బాగుచేసుకోవాలి. మనం మనస్సును బాగుచేసుకొంటే, రాగద్వేషముల యొక్క వేగం తగ్గించుకొంటే ఈ శరీరంలో ఉండగానే మోక్ష సుఖాన్ని పొందవచ్చు. వైకుంఠంలో ఏమి ఉందో అది ఇక్కడ కూడా ఉంది. అయితే మనకు వ్యక్తిభావన పోతే ఆ ఉన్నదేదో మనకు తెలుస్తుంది. అది భక్తివలన, ఉపాసన వలన, జ్ఞానం వలన సాధ్యం. శరీరం చనిపోయినప్పుడు మన కూడా ఎవరూ రారు, మనకు ఉన్న రాగద్వేషాలు మన కూడా వస్తాయి. గీతలో పరమాత్మ ఏమని చెప్పాడు అంటే ఎవడైతే బుద్ధిమంతుడో వాడు నేను పాపాలు చేసాను అనుకోడు, పుణ్యాలు చేసాను అనుకోడు, శరీరాన్ని ఎలావిడిచిపెట్టి వెళ్ళిపోతాడో అలాగ వాడు చేసిన పుణ్యపాపాలను కూడా ఇక్కడ విడిచి పెట్టి వెళ్ళిపోతాడు, ఇంక వాడికి ప్రయాణాలతో పనిలేదు. మనం ఏదైనా చిన్న మంచి పని చేస్తే పుణ్యం కోరుకొంటాము. పుణ్యం వస్తుంది అని చెపితేనేగాని చాలామంది ఆ మంచి పని కూడా చెయ్యరు, అదే వ్యక్తిభావన.

మనకు వచ్చే ఆలోచనలు, మనం చేసే పనులు భగవంతుడి దయకు అనుకూలంగా ఉండాలి. భగవంతుడి అనుగ్రహానికి మించినది ఏమీ లేదు, భగవంతుడి అనుగ్రహానికి అసాధ్య మంటూ ఏమీ లేదు, ఆయన అనుగ్రహం సంపాదించటానికి మాత్రమే మనం పని చేస్తూ ఉంటే జీవన్ముక్తస్థితిని పొందవచ్చు. సృష్టిలో అనేక రకాలవాళ్ళు ఉంటారు. మంచివారు ఉంటారు, చెడ్డవారు ఉంటారు మంచి వారు దేవుని సృష్టే, చెడ్డవారు దేవుని సృష్టే. వీళ్ళు

మంచివారు అని అనురాగం పెట్టుకోవద్దు, వీళ్ళు చెడ్డవారు అని ద్వేషం పెట్టుకోవద్దు, ఆయన సృష్టించాడు మనకు ఆ గొడవ ఎందుకు? మనం ఉదాసీనంగా ఉండి మన పని మనం చేసుకొని వెళ్ళిపోవాలి. నీలోపల అంతర్యామిగా నారాయణుడు ఉన్నాడు. నువ్వు అన్ని విధాలుగా ప్రయత్నం చేసి వాడి అనుగ్రహాన్ని సంపాదిస్తే నువ్వు ఇక్కడే తరిస్తావు అని పరమాత్మ చెపుతున్నాడు. మనకు భగవంతుడు ఉన్నాడని విశ్వాసం లేదు, ఆయన మాట మీద నమ్మకం లేదు అందుచేత మనం పాడైపోతున్నాము. అభిమన్యుడు యుద్ధంలో చనిపోయాడు. అర్జునుడికి కుమారుడిమీద మమకారం పోలేదు. కృష్ణుడు నోటి మాటలతో చెప్పినా అర్జునుడికి అశాంతి పోలేదు. అప్పుడు ప్రాక్టికల్‌గా చనిపోయిన కుమారుడిని చూపించాడు. అర్జునుడు కుమారుడిని పలకరించాడు. నీకు నాకు సంబంధం ఏమిటి అని వాడు అన్నాడు. శరీరం ఉన్నప్పుడు తండ్రీ, కొడుకు ఆదేహం లేనప్పుడు బంధుత్వం ఏమిటి? అప్పుడు అర్జునుడికి మోహం పోయింది. మన శరీరం చని పోయిన తరువాత ఆ కుటుంబంతో సంబంధం తెగిపోతుంది. భర్త ఎవరో, భార్య ఎవరో ఇవి అన్నీ దేహసంబంధాలు. దేహం ఉంటే కుటుంబం గాని దేహం లేనివాడికి కుటుంబం ఏమిటి? నేను అనే తలంపు ఉన్న వాడికి మనస్సు, మనస్సు ఉన్నవాడికి దేహం, దేహం ఉన్నవాడికి లోకం. అసలు నేను అనే తలంపు లేనప్పుడు వాడికి లోకం ఎక్కడ ఉంది అన్నారు భగవాన్.

భగవంతుడిని పొందటానికి అనేక మతాలలో అనేక మార్గాలు ఉన్నాయి. మనకు ఏ మార్గం ఇష్టమైతే ఆ మార్గంలో ప్రయాణించి ఆయనను పొందవచ్చు. మనం నేను, నాది అంటాము. ఆ వస్తువు నాది అనుకొంటే అదిపోతే దానికోసం పరుగెడతాము. అది నాది కాదు అని తెలిసింది అనుకోండి. ఆ వస్తువు పోయిన ఏ గొడవ ఉండదు. మనం చనిపోయేదాక చేసే పని ఏమిటి అంటే నాది కూడా పరుగెడుతున్నాము. నాది లేకపోతే ఇంక పరుగులు అక్కరలేదు. నేనులో నుండే నాది వస్తోంది. నేను లేకపోతే నాది లేదు. భక్తి మార్గంలో చెప్పేది ఏమిటి అంటే నేను అనే తలంపును తీసుకొనివెళ్ళి భగవంతుడి పాదాలకు అర్పిస్తే ఆ నేను పోయినప్పుడు ఇంక నాది కూడా ఉండదు. ఇంక నీవు శవాలను మోయనక్కరలేదు. నాకు పత్రం ఇవ్వండి, పుష్పం ఇవ్వండి, తోయం ఇవ్వండి అని కృష్ణుడు అంటాడు. అలాగే ఎప్పడైనా ఈ నేనును కూడా ఆయనకు నైవేద్యం పెడతాము అని మనకు ఇవ్వటం అలవాటు చేస్తున్నాడు. మనం ఇంటి ప్రక్కవారు చనిపోతే మనకు ఏమీ అనిపించదు. ఎక్కడో ఢిల్లీలో మీ మనవడు చనిపోతే ఇక్కడ నుండే ఏడ్చేస్తారు, దీనికి నాది కారణం. అంటే మనం దేహం చుట్టూ తిరుగుతున్నాము. వాడు పండితుడైనా పామరుడైనా వాడికి ధనం ఉన్నా లేకపోయినా, అధికారం ఉన్నా లేకపోయినా జీవితంలో ప్రతీ మనిషి ఈ నేను

చుట్టూ, నాది చుట్టూ తిరుగుతూ ఉంటాడు. అంతకంటే ఏమీ లేదు. దారుకావనంలో ఋషులు కర్మకాండలు చేస్తారు, యజ్ఞాలు, యాగాలు చేస్తారు. కాని కర్మకు కర్మఫలితానికి అనుసంధానం చేసేవాడు ఒకడు ఉన్నాడని ఒప్పకోరు. వారు దారి తప్పిపోతున్నారు అని వారికి విషయం తెలియజేయటం కోసం ఈశ్వరుడు అందమైన రూపంలో అక్కడకు వస్తాడు. ఋషులు యజ్ఞాలు చేస్తున్నారు, ఋషుల భార్యలు శివుడి వెనకాల పరుగెడతారు. వారు యజ్ఞాలు చేస్తున్నారు గాని వాళ్ళకు అది నా భార్య అనే ధోరణిపోలేదు. భార్యలు శివుడి వెనకాల పరుగెడుతూ ఉంటే, నాభార్య నాభార్య అంటూ ఋషులు వారి వెనకాల పరుగెడతారు. అంటే నాదిలో నుండే ఇది అంతా వచ్చింది. వేదంలో చెప్పిన కర్మకాండే చేస్తున్నారు గాని వారికి నేను, నాది అనే తలంపులు పోలేదు, అది పోగొట్టటానికే ఈశ్వరుడు ఆ రూపంలో వచ్చాడు. అసలు మనం అంటూలేము, ఉన్నది ఈశ్వరుడే, లోపల అంతర్యామిగా ఉన్నవాడు ఆయనే. నువ్వు ఉన్నావు అని అనుకొంటున్నావు కాబట్టి అందులో నుండి బయటకు రావటానికే ఈ యజ్ఞాలు, యాగాలు. మన మనస్సును బాగుచేసుకొంటే మనం ఎక్కడ ఉన్నా శాంతిగానే ఉంటాము, మనస్సు బాగాలేకపోతే ఎన్ని భోగాలమధ్యన ఉన్నా వాడికి అశాంతే. భగవంతుడి నామాన్ని స్మరించుకొంటూ, ఆయన మాటను ప్రమాణంగా తీసుకొని జీవిస్తూ ఉంటే ఉన్నది ఆయనే, ఇంకేమీ లేదు అన్న సంగతి మనకు అనుభవంలోనికి వస్తుంది. కబీరు ఒక మాట చెప్పాడు. కొంతమంది శరీరాలు చాలా అందంగా ఉంటాయి, కొంతమంది కుష్టిరోగంతో చర్మం పొలుసులు కింద రేగిపోయి బాధపడుతూ ఉంటారు. ఈ అందమైన శరీరం కలవారు నామం చేయకపోతే, కుష్టి రోగి నామం చేస్తూ ఉంటే ఈ కుష్టి రోగినే మనం గౌరవించాలి, అందమైన శరీరం ఉన్నవాడికంటే వాడే ఉన్నతుడు. ఆ అందమైన శరీరం ఉన్నవాడు భగవంతుడి అనుగ్రహానికి పాత్రుడవ్వడు, ఈ కుష్టిరోగే భగవంతుడి అనుగ్రహానికి పాత్రుడవుతాడు అని కబీర్ చెప్పాడు. అభ్యాసం విషయంలో అజాగ్రత్త పనికిరాదు, బాగా అభ్యాసం చెయ్యాలి. భగవంతుడు మంచి మాటలే చెపుతాడు, మనం బాగుపడే మాటలే చెపుతాడు, ఆయన సత్యమే చెపుతాడు అనే బుద్ధి మనకు ఉంటే ఇతరుల మాటలు మనం పట్టించుకోము లేకపోతే దారినపోయేవాడి మాటలు అన్నీ భుజాన వేసుకొని తిరుగుతాము. నిరంతరం జపం చేయటం వలన ఇతర ఆలోచనలు, ఇతర తలంపులు తగ్గిపోతాయి, పరమేశ్వరుడు ఒకడు ఉన్నాడు అనే భావన స్థిరపడుతుంది.

మనం మాట్లాడే మాట తియ్యగా ఉండాలి. మనమాట ఇతరులకు శాంతి కలుగజేయాలి. ఉన్నది ఒక్కటే. ఆ ఒక్కటే అనేకంగా కనిపిస్తున్నంతకాలం మనకు భయం కలుగుతుంది, ద్వేషం కలుగుతుంది, మృత్యువుకు లోబడతాము. నువ్వు ఒక్కడివి అంటే

ఒక్కడివే. మరి ఈ అనేకత్వం ఎక్కడ నుండి వచ్చింది, ఇది అంతా నీ మాయ. నీ పాదాలను ఆశ్రయిస్తే ఈ మాయలో నుండి బయట పడతాము. ఈ అనేకత్వంలో ఆ ఒక్కటినే చూడగలగాలి. అదే ఇన్ని రూపాలను, ఇన్ని నామాలను ధరించింది. మనం చూసేటప్పుడు గుణాలు వేరువేరుగా ఉంటాయి, రంగులు వేరువేరుగా ఉంటాయి. ఈ దేహాలు నిజంకాదు, మనస్సు నిజంకాదు. పూర్వజన్మలో వారుచేసిన కర్మను బట్టి కొంతమందికి మంచి గుణాలు ఉండవచ్చు, కొంతమందికి చెడ్డ గుణాలు ఉండవచ్చు. ఈ గుణాలు అన్నీ మనస్సులో ఉంటాయి, ఇవి అన్నీ అసత్యమే. కాని వీటి అన్నింటికి ఆధారంగా ఒకడు ఉన్నాడు, వాడే నారాయణుడు, వాడు ఒక్కడే నిజం, నువ్వు ఆయనను చూడు అప్పుడు మనస్సులో వికారాలు రావు, శరీరాల రంగుల యొక్క ప్రభావం నీ మీద పడదు. ఎంతటి నల్లవారిని చూసినా నీకు వికారం రాదు, ఎంత అందమైన వారిని చూసినా నీకు ఆకర్షణ కలుగదు. ఎప్పుడు? అంతర్యామిగా ఉన్న నారాయణుడిని నీవు దర్శించినప్పుడు, అదే నీ కడసారి జన్మ. ఎదుటివారు మనపట్ల ఎలా ఉంటున్నారు అనేది అనవసరం. ఇతరులపట్ల మనం భగవంతుడు చెప్పినట్లుగా ఉంటే సరిపోతుంది. ఇది బాగుపడే వాడి లక్షణం. ఎవరినీ ద్వేషించవద్దు, భగవంతుడు ప్రేమించమని చెప్పాడు కాబట్టి నీవు అందరినీ ప్రేమించాలి, వారు చెడ్డవారైతే భగవంతుడే చూసుకొంటాడు అది మనకు సంబంధం లేదు. ఎందుచేతనంటే మంచి, చెడ్డ మనస్సుకు సంబంధించినవి, రంగు దేహానికి సంబంధించినది, ఆ రెండూ వాడు కాదు, ఇవన్నీ మనం సంకల్పించుకొంటున్నాము. నీ మనస్సు అణిగి ఉంటే, నీ మనస్సు చల్లగా ఉంటే, నీ మనస్సు సంస్కరింపబడితే, నీ మనస్సు రాగద్వేషరహితంగా ఉంటే నీ దేహం కాశీలోను, రామేశ్వరం లోను, అరుణాచలంలోను ఉండనక్కరలేదు, నీ దేహం ఎక్కడ ఉన్నా నీవు పరమశాంతిని అనుభవిస్తావు. నిరంతరం భగవంతుడిని స్మరించేవాడు ఎక్కడ ఉన్నా ఒక్కటే, ఆ స్థలం ముఖ్యం కాదు, ఆ పరిసరాలతో సంబంధం లేని శాంతిని, పరమశాంతిని అనుభవిస్తాడు.

కొంతమందికి నింద వస్తే మొఖం చిన్నది చేసేసుకొంటారు, స్తోత్రం చేస్తే మొఖం పెద్దది చేసేసుకొంటారు. ఈ నిందాస్తుతులను మనం పట్టించుకోకూడదు, వాటిని లోపలకు తీసుకోకూడదు. ఈ రెండూ అబద్ధమే. నిందాస్తుతులతో మనం సంబంధం లేకుండా ఉంటే ఎవరైనా మనలను విమర్శించినా, ఎవరైనా స్తోత్రం చేసినా మనకు వికారం కలుగదు, అటువంటి స్థితిని నీవు పొందాలి, అప్పుడు నీకు జీవన్ముక్తస్థితి కలుగుతుంది. నీ మనస్సులో మినహాయింపులు లేకుండా ఈశ్వరసంకల్పాన్ని గౌరవించటం నేర్చుకొంటే నీకు వ్యక్తిభావన నశిస్తుంది. అంతా ఈశ్వరుడే అనే భావన నీకు కలుగుతుంది. ఉన్నది ఈశ్వరుడే, అంతా ఆయనే అంటున్నారు. అంతా ఈశ్వరుడే అయినప్పుడు మరి నేను ఎవరిని? ఈ నేను అనే

తలంపు ఎందుకు వస్తోంది. ఈ నేను అనే తలంపు మీద నీ పాదం పెట్టు అప్పుడు అది అణిగిపోతుంది, అప్పుడు అద్వైతానుభవం కలుగుతుంది, ఆ పనిచేసిపెట్టు అరుణాచలేశ్వరుడా అంటున్నారు భగవాన్. దూడను కట్రాడుకు కట్టివేస్తే ఆ కట్రాడును పట్టుకొని ఎలా ఉంటుందో అలాగ నీ మనస్సు ఏదో దేవుని నామానికి కట్టివేసి జపం చేయిస్తూ ఉంటే అది ఆ నామాన్ని పట్టుకొని ఉంటుంది, అప్పుడు దానికి ఇతరతలంపులు, ఇతరఆలోచనలు ఆగిపోతాయి. మనుషులు పుడుతూ ఉంటారు, చనిపోతూ ఉంటారు. ఇదంతా అబద్ధమే, అక్కడ నీ మనస్సును పెడితే ఆ ప్రవాహంలో కొట్టుకొనిపోతావు. అందుచేత నీ మనస్సును అక్కడ పెట్టవద్దు. దేశకాలములతో సంబంధం లేకుండా, జనన మరణములతో సంబంధం లేకుండా నీ హృదయంలో అంతర్యామిగా బ్రహ్మపదార్థం ఉంది. నీ మనస్సును అక్కడ పెట్టి దానిని జపిస్తూ ఉంటే దానిని ధ్యానిస్తూ ఉంటే నీవు దానిని పొందుతావు. మనం ద్వేషించటం నేర్చుకొన్నాము కాని ప్రేమించటం నేర్చుకోలేదు, ప్రేమించటం నేర్చుకొంటే ఈశ్వరానుగ్రహానికి పాత్రులవుతాము. భగవంతుడికంటే మనం వేరుగా ఉన్నాము, భగవంతుడి సంకల్పానికి భిన్నంగా మనం ప్రవర్తించగలము, మనం ఏదైనా సాధించగలము అని అనుకోవటం వలన మనం పాడైపోతున్నాము. మనకు ఏదైనా మంచి జరిగినా అది భగవంతుడి సంకల్పాన్ని బట్టి వచ్చింది కాని అది మన తెలివితేటల వలన రాలేదు, మన పొగరుబోతుతనం వలన ఏదో మనం సాధించాము అని మనకు అనిపిస్తుంది. మీకు డబ్బు, అధికారం, అంగబలం ఉండవచ్చు. ఇవి అన్నీ స్వప్న సమానము అని భగవంతుడు చెపుతూ ఉన్నా మనలో ఉన్న అజ్ఞానం వలన అది మనం నమ్మలేకపోతున్నాము. అజ్ఞానికి జాగ్రదవస్థ ఒక్కటే నిజం, జ్ఞానికి మూడు అవస్థలు అబద్ధం. అజ్ఞానికి శాస్త్రం ప్రమాణం కాదు, జాగ్రదవస్థ ప్రమాణం.

మీరు సబ్జక్టు ప్రోపర్‌గా అర్థం చేసుకొంటే పరమశాంతిలో ఓలలాడతారు. వాడు అలా చేసాడు ఏమిటి? వీడు ఇలా చేసాడు ఏమిటి అంటాము. వాడు అలా చేయటానికి భగవంతుడు ఏర్పాటు చేసాడు. నీకెందుకు ఆ గోల? నీకు తెలిసినా, తెలియకపోయినా నీ ముక్కులోగాలి సహజంగా తిరుగుతూ ఉంటుంది, అలాగే నీవు చేసే జపం కూడా సహజం అయ్యే వరకు జపం చేస్తూ ఉండాలి. జపం చేయటం వలన నీకు దుఃఖాన్ని తీసుకొని వచ్చే తలంపులు అన్నీ ఆగిపోతాయి. నీ ప్రయత్నాలతో సంబంధం లేకుండా నీ మనస్సు భగవంతుడి నామాన్ని జపిస్తూ ఉంటే, నీకు తెలియకుండానే నీ మనస్సు నార్మల్‌గా, నేచురల్‌గా జపం చేస్తూ ఉంటే నీ హృదయంలో ఉన్న సహజమైన వస్తువును జపం నీకు పట్టి ఇస్తుంది. ఇదంతా బ్రహ్మ స్వరూపమే, ఇదంతా ఆనంద స్వరూపమే అని నీకు అనుభవంలోనికి రావటానికి బహుజన్మల సాధన వలనగాని, బహుజన్మల పుణ్యబలం ఉంటేగాని అది నీకు

తెలియబడదు అని పరమాత్మ చెప్పాడు. ఉన్న వస్తువును ఉన్నట్లుగా గ్రహించటానికి బహుజన్మల కృషివలన గాని అది నీకు సాధ్యం కాదు. బహుజన్మలు నీవు సాధన చేసి ఉంటే, సత్కర్మ ఆచరించి ఉంటే ఆ పుణ్యఫలితంగా నీ బుద్ధికి పక్వత వస్తుంది, అప్పుడు ఇదంతా వాసుదేవ మయం అని నీకు గోచరిస్తుంది. ఉన్నది ఒక్కటే వస్తువు దానికంటే వేరుగా ఏమీ లేదు అనే అనుభవం నీకు కలుగుతుంది. ఆ అనుభవం రాకపోతే ఏ జన్మకు ఆ జన్మ శరీరం కూడా నీడ వచ్చినట్లుగా అశాంతి, దుఃఖం నిన్ను వెంటాడుతూ ఉంటాయి. మన పుట్టుక మన చేతిలో లేదు, మన చావు మనచేతిలో లేదు కాని మనం బడాయి మాటలు చెపుతాము. ఎందుకు ఆ బడాయి మాటలు, వాటివలన ప్రయోజనం ఏమిటి? ప్రతీమనిషిని గుణాలు ఆడిస్తున్నాయి. ఆ గుణాలలో ఉన్నంతసేపు ఎవడూ ఒడ్డుకు రాలేడు. ఈశ్వరుడి యందు భక్తి లేకుండా, మనం చేసే కర్మలు ఈశ్వరుడికి నైవేద్యం పెట్టకుండా, ఆయన అనుగ్రహం పొందకుండా ఎంతటివాడైనా, ఎన్ని తెలివితేటలు ఉన్నా గుణాలలో నుండి బయటకు రాలేడు. ఇతరులు మనలను ద్వేషిస్తూ ఉంటే ఆ ద్వేషాన్ని మనం తట్టుకొంటున్నామా లేదా, ఆ నైతిక బలం మనకు ఉందా లేదా అని చూడటానికే వారిచేత ద్వేషింపచేస్తాడు. అది మనకు తెలియక వాడిని తిట్టిపోస్తాము. ఇదంతా మాయ. నిన్ను తిట్టేవారిలో కూడా నారాయణుడు అంతర్యామిగా ఉన్నాడు, ఆ చిన్న విషయం అర్థమవ్వటానికి కూడా బహుజన్మల కృషి ఉంటే గాని అది నీకు తెలియదు. మనకు పూజ ఎంత ముఖ్యమో సద్గ్రంథను శ్రవణం చేయటం, మననం చేయటం కూడా అంతే ముఖ్యం. అసలు మనలో అజ్ఞానం ఉందనే సంగతి శ్రవణం లేకపోతే తెలియనే తెలియదు. నీ హృదయంలో ఉన్న సత్యం శాంతి పూరితమైనది, జ్ఞానపూరితమైనది, కళ్యాణప్రదమైనది, అది సహజమైనది, అది ఎప్పుడూ ఉండేది దాని తాలుక అనుభవం నీకు కలిగే వరకూ నీవు జపధ్యానములు విడిచిపెట్టవద్దు. నువ్వు లోకానికి సంబంధించిన పనులు చేస్తున్నప్పటికీ నీ మనస్సు అభ్యాసం చేస్తూ ఉండాలి. మన నిజమైన ఇల్లు మన హృదయం. మన నిజమైన ఇంటికి మనం చేరకుండా మనకు ఏ బలహీనతలు అయితే అడ్డు వస్తున్నాయో, ఏ పాడుబుద్ధి అయితే అడ్డువస్తోందో వాటిని జపధ్యానములు తొలగిస్తాయి. జపధ్యానములు నిన్ను శాంతిమయుడిగా, ఆనందమయుడిగా, పరిపూర్ణుడిగా చేస్తాయి. మీకు శ్వాస ఉన్నంత కాలం విశ్వాసం విడిచిపెట్టవద్దు, శ్రవణ మననములు విడిచిపెట్టవద్దు, జపధ్యానములు విడిచిపెట్టవద్దు. నీవు అలా అభ్యాసం చేయగా చేయగా నీకు లోచూపు కలుగుతుంది. నీకు లోచూపు ఎప్పుడైతే కలిగిందో లోపలఉన్న వస్తువు తనంతట తానుగా నీకు వ్యక్తమవుతుంది.

## సద్గురు శ్రీ నాన్నగారి అనుగ్రహభాషణములు

| | | |
|---|---|---|
| సెప్టెంబర్ | 09 | అయి భీమవరం, షిరిడీ సాయిబాబా ఆలయం |
| సెప్టెంబర్ | 23 | హైదరాబాద్ చిక్కడపల్లి త్యాగరాజభవనం |
| సెప్టెంబర్ | 30 | జిన్నూరు శ్రీ రమణ క్షేత్రం |

**With malice to none, Charity even unasked, and help to all creatures in thought, word and deeds, is the pious nature of good men, always.**

**- Mahabharatha**

# సద్గురువు శ్రీ నాన్నగారు

భగవాన్ శ్రీ రమణ మహర్షిచే ఆశీర్వదింపబడి, ఎంపిక చేయబడిన, సద్గురువు శ్రీ నాన్నగారి వలన నేటి సమాజంలో ఒక నవ్యశకం ప్రారంభమైనది. తోటి మానవాళిని స్వరూపంగా ఉన్న సత్యంలోకి మేల్కొలుపుటకు ప్రవచన రూపమైన జ్ఞానయజ్ఞాలకు నాంది పలికి, వాటిని సజీవ నదీ ప్రవాహంలాగ కొనసాగిస్తున్నారు. ఆత్మజ్ఞాన సుసంపన్నులైయుండి, అత్యంత సరళంగా జీవిస్తూ, మానవాళిని పట్టి పీడిస్తున్న భ్రాంతిరూపమైన అజ్ఞానము నుండి విడుదల పొందుట ద్వారా స్వస్వరూప ఎరుకలోకి మేల్కొనుటకు వారి దివ్యబోధను అందిస్తున్నారు. శ్రీనాన్నగారు తమ వాక్కుచేత, నిర్మల ప్రేమచేత, మనలను పునీతులను చేస్తూ, మనలోని వ్యక్తిభావనను తొలగించడంపై వారి దృష్టిని కేంద్రీకరిస్తారు. భగవాన్ శ్రీ రమణమహర్షి బోధాసారాన్ని అత్యంత సులభరీతిలో వారి జ్ఞాన ప్రవచనాల ద్వారా మరియు 'రమణ భాస్కర' మాసపత్రిక ద్వారాను అందిస్తూ, సాధకులకు గొప్ప మార్గదర్శియై జీవించే కళను నేర్పుతూ, సుఖ శాంతులను అందిస్తున్నారు. "దేహం జీవించి యుండగానే దేహాత్మబుద్ధి నుండి విడుదల పొందుట ద్వారా అమృతస్థితిని అనుభవైకవేద్యం చేసుకోవడమే ఈ మానవ జీవిత గమ్యం" - అన్న శ్రీ నాన్నగారి బోధాసారాన్ని అనుభవైకవేద్యం చేసుకొనుట ద్వారా మాత్రమే గురుఋణం తీర్చుకోగలము.

**- చావలి సూర్యనారాయణమూర్తి**

టీచర్, అమలాపురం

# గురువు అంటే - నడుస్తున్న దైవం

భగవంతుడు తన కృపను మానవుల మీద సద్గురువు ద్వారానే చూపుతాడు. ఆయనే మానవాకారంలో మన మధ్య పుట్టి మనలోని భగవత్ భక్తిని ప్రేరేపించి తన చెంతకు పిలుచుకొంటాడు. సద్గురువుతో అనుబంధం ఏర్పడిన తరువాత శిష్యుడు అతనితో విముఖుడైనా గురువు మాత్రం అతన్ని వదలడు. అతని నిస్వార్థ ప్రేమకు సాటియైనది ఈ లోకంలో మరొకటి లేదు. సద్గురువునందు ప్రేమ కుదిరితే జపతపాలు, తీర్థయాత్రలు, వేదశాస్త్రపఠనాలు మొదలుగా గలవన్నీ ఆయన ప్రేమ ముందు తలవాల్చవలసిందే. దానికి సమానమైనది ఏదీ లేదు. గురుప్రేమ లభించిననాడు నోరు మూతపడుతుంది. బాహ్య నేత్రాలు మూసుకొనిపోతాయి. మనస్సు శాంతిలో నిశ్చలమౌతుంది. దృష్టి గురుపాదాలలో లీనమౌతుంది కాని ఆ ప్రేమ రంగు అద్దటానికి హృదయమనే వస్త్రం పరిశుభ్రంగా ఉండాలి. తెలివిలేని పిల్లలను తల్లికోడి ఏవిధంగా తన రెక్కల క్రింద రక్షిస్తుందో అదేవిధంగా సద్గురువు తన నియంత్రణలో నడుచుకొనే వారి పూర్తి బాధ్యతను వహిస్తాడు. చిన్న చిన్న పొరపాట్లను కూడా అప్పటికప్పడే ఎత్తి చూపి వాటిని సరిదిద్దుతాడు. అహంకారాన్ని పెరగనివ్వడు. గర్వాన్ని అణచటానికి ఒక్కొక్కసారి నిర్దాక్షిణ్యంగా వ్యవహరించవచ్చు. నేటి మిత్రులు రేపటి శత్రువుగా వ్యవహరించవచ్చును. గురువు ఒక్కడే నమ్మదగినవాడు. మనం తాళం పోగొట్టుకొంటే తాళం తీసేవాని దగ్గరకు వెళతాము. బంధనాల రూపమైన రాగద్వేషాలనే తాళం విప్పాలంటే గురువు చేతిలో ఉన్న తాళం చెవికోసం ఆయనను ప్రాధేయపడాలి. సుడిగాలి వైపుకు దుమ్ము ఏవిధంగా లాగుతుందో అలాగే మహాత్ములు ఎక్కడికి వెళ్ళినా భక్తులు వారి చుట్టూ చేరుతారు. వారి శ్వాసే కాక వారి శరీరంపై వీచే గాలి కూడా లోకానికి మేలు చేస్తుంది అంటారు పెద్దలు. "సద్గురువు జీవన సరళిని అతని మనోబుద్ధులతో చేసే కర్మలను గాని మనం అంచనా వెయ్యలేము. పర్వతాన్ని వర్ణించబోయి అందులో చిన్న రాయిని వర్ణించటం లాంటిది. జ్ఞాని గురించి మనం ఏమి చెప్పకొన్నా అంతా అబద్ధమే అవుతుంది" అన్నారు కబీర్. జ్ఞానికి సంతోష విచారాలు, రక్తి, విరక్తి, ముక్తి కోసం కోరికా ఏదీ ఉండదు. అతడు ఏదీ కాదు. అన్నీ అతడే.

- **సాగిరాజు రామకృష్ణంరాజు**, అర్థవరం